ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టి శ్రీరాములు **నెల్లూరు** జిల్లా వార్తలు

మంగళవారం 11 మార్చి 2025



క్వింటం శనగ ధర రూ.5670

- రంగు మారిన, నాణ్యతలేనివి కొనం
- నేటి నుంచి రిజిస్ట్రేషన్లు : జేసీ



నెల్లూరు (వ్యవసాయం), మార్చి 10(ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన శనగ దిగుబడులను క్వింటం రూ.5670 కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 8,666 ఎకరాల్లో శనగ సాగవగా, కనీస మద్దతు ధర లభించకపోతే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. రైతులు వీఏఏలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. మార్చి 11 నుంచి 20వతేదీ వరకు ఈ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. రోజుకు ప్రతి రైతు నుంచి 25 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. 15రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాకు నగదు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో 14శాతం తేమ, ఒకశాతం ఇతర వ్యర్థ పదార్థాలు, దెబ్బతిన్న పప్పు దినుసు గింజలు 3శాతం, కొద్దిగా దెబ్బతిన్న, రంగులేని పప్పు దినుసు గింజలు 4 శాతం, పక్వానికి రాని, ముడత పప్పు దినుసులు గింజలు 6శాతం, పురుగు పట్టిన పప్పు దినుసు గింజలు 4శాతానికి మించి ఉండరాదని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. కొనుగోలు విషయాల్లో ఇబ్బందులు ఎదురైతే 8978381839, 8985084988, 9908203264, 6309009805 నెంబర్లకు ఫోన్ చేయాలని జేసీ రైతులను కోరారు.

● ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 3182.50 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసీ మరో ప్రకటనలో తెలిపారు. సోమవారం 571.280 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

అంతా 'ఓపెనే'!

ఒకరి అవసరాలు మరొకరికి ఆదాయ వనరుగా మార్చుకుంటుంటారు. అక్రమ సంపాదన కోసం రకరకాల మార్గాలు ఎంచుకుంటూ అందినకాడికి దండేసుకుంటూ ఉంటారు. ఇది ప్రతిచోటా జరిగేదే. ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షల్లోనూ ఇదే తంతు జరుగుతోంది. కారుణ్య నియామకాలు పొందిన వారు, మధ్యలో చదువు మానేసిన వారు ఈ ఓపెన్ స్కూలు పరీక్షలు రాస్తుంటారు. అయితే, కారుణ్య నియామకాలు పొందిన వారి అవసరాలను అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. 'పరీక్షలు జరుగుతున్నప్పుడే కదా! మా జేబులు నిండేది' అన్న ధోరణలో వ్యవహరిస్తూ మాస్ కాపీయింగ్‌కు సహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇందుకుగాను ఒక్కో అభ్యర్థి నుంచి రూ.వేలల్లో నగదు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అదెలాగో ఈ కథనం చదవండి.

\- కావలి, (ఆంధ్రజ్యోతి)

- 'ఓపెన్ స్కూల్' ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్
- కేంద్రాలకు చేరుతున్న సమాధానాల నకళ్లు
- ఒక్కో అభ్యర్థి నుంచి రూ.వేలల్లో వసూలు
- ఇన్విజిలేటర్ల నుంచి ఉన్నతాధికారుల వరకు పంపకాలు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్‌స్కూల్) ఇంటర్ పరీక్షలు ఈ నెల 3వ తేదీన ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 20 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి. మొత్తం 3,580 మంది పరీక్షలు రాస్తున్నట్టు సమాచారం. మాస్ కాపీయింగ్ జరగకుండా 200 మంది ఇన్విజిలేటర్స్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను నియమించినట్లు అధికారులు చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే 8341408109కు ఫోన్ చేయాలని కూడా ప్రకటించారు. అయితే, ఆచరణలో ఉన్నతాధికారులు చేతులెత్తేయగా స్థానికంగా ఉంటున్న అధికారులు మాత్రం పరీక్షలు జరుగుతుండగానే జేబులు నింపుకోవాలన్న ధోరణలో వ్యవహరిస్తున్నారు.



కావలి : ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు జరుగుతున్న జడ్పీ స్కూల్ ప్రధాన గేటుకు వేసి ఉన్న తాళం

● **కాపీయింగ్ ఇలా..**

స్థానికంగా ఉంటున్న జెరాక్స్ సెంటర్ల నుంచి కనిష్ఠంగా 50 మార్కుల సమాధానాలతో కూడిన జిరాక్స్ కాపీలను ఆయా కేంద్రాలకు చేరవేస్తున్నట్టు సమాచారం. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.10-15 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఇలా సేకరించిన నగదును పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ల నుంచి సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, జిల్లాస్థాయి ఉన్నతాధికారుల వరకు చేరవేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసమే కొందరు ఉపాధ్యాయులు ఈ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వచ్చేందుకు పైరవీలు కూడా చేయించుకుం టున్నట్టు సమాచారం. ఇక పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేసి, కాపలాగా ఓ వ్యక్తిని నియమించి లోపల కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఏదైనా స్క్వాడ్ తనిఖీలకు వస్తుంటే ముందుగానే వీరికి సమాచారం అందిపోతుంది. స్క్వాడ్ వచ్చి వెళ్లేంతవరకు మౌనం దాల్చి ఆ తర్వాత తిరిగి కాపీయింగ్‌కు సహకరిస్తున్నారు.

● **పాతూరు కేంద్రంగా..**

జిల్లావ్యాప్తంగా 20 కేంద్రాలలో పరీక్షలు జరుగుతుండగా, కావలి పట్టణంలోనే ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కో కేంద్రంలో 120 నుంచి 150 వరకు అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పాతూరు సెంటర్‌లోని ఓ జెరాక్స్ సెంటర్ నుంచి సమాధానాల నకళ్ల కాపీలు అభ్యర్థులకు అందిస్తున్నట్టు సమాచారం. పరీక్ష ప్రారంభమైన ఒక గంట తర్వాత అవి కేంద్రాలకు చేరతాయి. ఇటీవల కావలిలో కొన్ని కేంద్రాలను డీఈవో బాలాజీరావు తనిఖీ చేయగా ఆయన వచ్చి వెళ్లిన తర్వాత యథాప్రకారం కాపీయింగ్ జరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కాపీయింగ్ జరుగుతున్నట్టు కొంతమంది డీఈవోకు ఫిర్యాదు చేసినా తాము పకడ్బందీగానే జరుపుతున్నట్టు తెలిపారు. అయితే, కాపీయింగ్ మాత్రం అడ్డూఅదుపులేకుండా జరుగుతూనే ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఓపెన్ స్కూలు ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా జరిగేలా చూడాలి.

దేవతలారా.. రారండి!

రంగడు, ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

వేడుకగా ధ్వజారోహణం.. తొలిరోజు శేషవాహనంపై దర్శనం



బిట్రగుంట : ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పండితులు

నెల్లూరు (సాంస్కృతికం)/బిట్రగుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : 'ఎంతో వైభవోపేతంగా నిర్వహించదలచిన స్వామివారి బ్రహ్మోత్సవాలకు దేవతల్లారా రారండి.' అంటూ ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ నెల్లూరులోని రంగనాథ స్వామి ఆలయం, బోగోలు మండలంలోని బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం వేడుకగా జరిగింది. నగరంలోని రంగనాథుడి ఆలయంలో ఉదయం ధ్వజారోహణం కనుల పండువగా జరిగింది. తొలుత గరుడ ధ్వజపటాన్ని పద్మశాలీ సంఘం ఊరేగింపుగా తీసుకొచ్చింది. అనంతరం విశేష పూజలు చేసి సకల దేవతలను బ్రహ్మోత్స వాలకు ఆహ్వానం చేశారు. అనంతరం ధ్వజస్తంభానికి కట్టారు. అనంతరం కోడి ముద్దలను సంతానం లేని మహిళల కు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఏర్పా టు చేసి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం రాత్రి స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు సిబ్బంది పర్యవేక్షించారు.



శేషవాహనంపై దేవేరులతో కొలువుదీరిన రంగనాథుడు

● బిలకూట క్షేత్రంలో తిరుమంజన కార్యక్రమం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం గర్భాలయాల శుద్ధి, మూలవిరాట్‌తో పాటు చిన్న ఉత్సవర్లకు అభిషేకాలు జరిగాయి. డాక్టర్ ప్రవీణ్ కుమార్, నరకూచి వెంకటనరసయ్య జూటూరి శివరామకృష్ణమూర్తి దంపతులు స్వామి, అమ్మవార్లకు వస్త్రాలు అందజేశారు. సాయంత్రం జరిగిన ప్రత్యే క పూలంగి సేవ, రాత్రి ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. కోడిముద్దల కోసం మహిళలు ఎగబడ్డారు. అనంతరం ప్రసన్న వేంకటేశ్వర స్వామి కృష్ణావతారంలో శేషవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు.



బిట్రగుంట : కోడిముద్దల కోసం వేచిఉన్న భక్తులు

పక్కా గృహాలకు నగదు పెంపు

● కూటమి ప్రభుత్వం నిర్ణయం ● ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వరం

నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. స్థలాలు ఇచ్చినా చాలీచాలని నిధులతో ఇళ్లు నిర్మించుకోలేకున్న పేదలు, పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసేలా నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన జీవోను సోమవారం జారీ చేసింది. నిరుపేద కుటుంబానికి ఇప్పటి వరకు ప్రభుత్వం స్థలం ఇవ్వడంతోపాటు గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసేది. ఇంటి నిర్మాణానికి ఆ నిధులు చాలక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన నిరుపేద కుటుంబాలు ఇళ్లు నిర్మించుకోలేక, ప్రభుత్వ సొమ్ము చాలక, అప్పులు చేయలేక నిర్మాణాలకు దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వం కాంట్రాక్టర్ల చేత ఇళ్ల నిర్మాణాలు చేపడు తూ వస్తున్నా, అవి అసంపూర్తిగా, నాసిరకంగా ఉంటున్నాయి. దీంతో ప్రతి పేదకుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చాలని ఆలోచించిన కూటమి ప్రభుత్వం నిర్మాణాలకు నగ దు మంజూరును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. నిరుపేద కుటుంబాలైన ఎస్సీ, బీసీలు, ఎస్సీలకు ఇచ్చే రూ.1.80లక్షలకు అదనంగా మరో రూ.50 వేలు ఇవ్వాలని నిర్ణయించిం ది. అలాగే ఎస్టీలకు రూ.75వేలు అదనంగా ఇవ్వనున్నది.

నీటిపారుదల పైపులకు రూ.35లక్షల మంజూరు

● రైతులకు 50శాతం రాయితీపై అందజేత

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ పోషకాహార పోషణ, ఆహార భద్రత, పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, జాతీయ నూనె గింజలు.. తదితర పథకాల కింద రైతులకు నీటిపారుదల పైపులను 50శాతం రాయితీపై అందించేందుకు జిల్లాకు రూ.35లక్షలు మంజూరైనట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 70 వేల హెక్టార్లు లక్ష్యం కాగా, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం 50శాతంగానీ గరిష్ఠంగా రైతుకు ఐదు ఎకరాల వరకు రూ.15వేలు సబ్సిడీ అందుతుందని పేర్కొన్నారు. ఏపీ ఎంఐపీ ద్వారా గుర్తింపు పొందిన కంపెనీల నుంచి రైతులు నీటి పైపులు కొనుగోలు చేసి బిల్లులు అందజేయాల్సి ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని ఆమె తెలిపారు.



వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎన్ఐవోటీ శాస్త్రవేత్తలు

సాంకేతికత రంగాల్లో ఎన్ఐవోటీ సహకారం అవసరం

వెంకటాచలం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సముద్ర పరిశోధన, సాంకేతికత రంగాలలో ఎన్ఐఓటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ) సహకారం వీఎస్‌యూకు ఎంతో అవసరమని ఆ వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. చెన్నైలోని ఎన్ఐఓటీ కేంద్రాన్ని సోమవారం వీఎస్‌యూ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎన్ఐఓటీతో కలిసి వీఎస్‌యూ పని చేసేందుకు అవగాహన ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ఎన్ఐఓటీ ఆధునిక సౌకర్యాలను ఉపయోగించి పరిశోధనలు చేయగలరని ఆకాంక్షించారు. ఎన్ఐఓటీ నిపుణుల మార్గదర్శకత్వంలో మెరైన్ బయాలజీ సముద్ర సాంకేతికతలో కొత్త ప్రాజెక్టులు ప్రారంభించవచ్చన్నారు. ఈ సహకారంతో సముద్ర వనరుల వినియోగం, పరిరక్షణలో నూతన పరిజ్ఞానాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం ఎన్ఐఓటీ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్, శాస్త్రవేత్తలు జీ ధరణి, వినీత్‌కుమార్, సచితానందం, గర్లపాటి దేవిరామ్‌తో కలిసి పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ కే సునీత, ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, మెరైన్ బయాలజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

గృహ రుణం.. తప్పింది భారం!

బ్యాంకుల నుంచి అందుతున్న నోటీసులతో సతమతమవుతున్న టిడ్కో గృహాల లబ్ధిదారులకు భారీ ఊరట లభించింది. ఐదేళ్లుగా పడుతున్న బాధలను తీరుస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్లు పొందకపోయినా కొందరు లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి మాత్రం రుణాలు మంజూరయ్యాయి. ఈ రుణాలను ప్రభుత్వం జమ చేసుకుందే కానీ, లబ్ధిదారుడికి ఇంటిని అప్పగించలేదు. ఈఎంఐలు చెల్లించాలంటూ బ్యాంకర్ల నుంచి నోటీసులు అందుతుండటంతో పేదలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికే కొంతమంది ఎన్‌పీఏగా (మొండి బకాయిదారులు) ముద్ర వేసుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ బకాయి ఈఎంఐలను బ్యాంకులకు చెల్లించేందుకు రూ.148 కోట్లు మంజూరు చేసింది. అందులో జిల్లాలో 3,427 మంది బాధితులు ఉండగా, వారికి సంబంధించి సుమారు రూ.20 కోట్ల వరకు బ్యాంకు రుణాలను చెల్లించనున్నది.

- 'టిడ్కో' లబ్ధిదారులకు భారీ ఊరట
- ఈఎంఐల చెల్లింపులకు రూ.20 కోట్లు విడుదల
- అర్హుల జాబితాలో 3,427 మంది
- త్వరలోనే జమ చేస్తాం :ఈఈ



నెల్లూరు : వెంకటేశ్వరపురంలోని టిడ్కో గృహాల సముదాయం



నెల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 2014-19 మధ్య కాలంలో జిల్లాలోని మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాలను నిర్మించడం ప్రారంభించారు. 2019 ఎన్నికల నాటికి కొన్ని ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించారు. మరి కొన్ని ఇళ్లు చివరిదశలో ఉన్నాయి. 365 చదరపు అడుగులు, 430 చదర పు అడుగుల విస్తీర్ణం కలిగిన ప్లాట్లను ఎక్కు వ మంది పేదలు ఎంపిక చేసుకున్నారు. 365 చదరపు అడుగుల ప్లాటు యూనిట్ విలువ రూ.7.55 లక్షలుగా అందులో బ్యాంకు రుణం రూ.3.15 లక్షలు ఉంది. మిగిలినది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ కాగా రూ.25 వేలను మాత్రం లబ్ధిదారుడు నేరుగా చెల్లించాలి. ఇక 430 చదరపు అడుగుల ప్లాటు యూనిట్ విలువ రూ.8.55 లక్షలు కాగా, అందులో బ్యాంకు రుణం రూ.3.65 లక్షలు ఉంది. ఇలా అర్హులైన పేదలను ఎంపిక చేసి బ్యాంకు రుణాలు కూడా ఇప్పించారు. పూర్తయిన ఇళ్లను కొంత మందికి అప్పగించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్ల నిర్మాణాలను ఆపేసింది. దీంతో చివరి దశలో ఉన్న ఇళ్లు పూర్తి కాలేదు. కానీ అప్పటికే లబ్ధిదారులకు మంజూరైన బ్యాంకు రుణాలను మాత్రం ప్రభుత్వం జమ చేసుకుంది. ఈ క్రమంలో నెలవారీ కంతులు (ఈఎంఐలు) చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు నోటీసులు రావడం ప్రారంభమైంది. ఇటు ఇళ్లు అందకపోవడం, అటు నోటీసులు మాత్రం అందుతుండటంతో లబ్ధిదారులు సతమతమయ్యారు. ఇళ్లు ఇవ్వకపోవడంతో ఈఎంఐలు కట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. దీంతో చాలామంది మొండిబకాయిదారులుగా మారిపోయారు. ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 3,427 మంది టిడ్కో ఇళ్ల రుణగ్రహీతలు బ్యాంకులకు ఈఎంఐలు చెల్లించడం లేదని అధికారులు గుర్తించారు. వాస్తవానికి ఈ విషయంలో గత ప్రభుత్వానిదే తప్పు. అప్పుడు ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించి ఉంటే వారు ఈఎంఐలు కట్టుకునేవారు.

● **బకాయిల చెల్లింపులకు నిధులు**

దీంతో ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ బకాయి ఈఎంఐలను చెల్లించేందుకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి నిధులను కూడా విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే ఈ బకాయిలను బ్యాంకులకు జమ చేయనుంది. జిల్లాలో 23,888 ఇళ్ల నిర్మాణం జరుపుకుంటుండగా ఇప్పటికి 13 వేల ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారు. మిగిలిన ఇళ్లను ఈ ఏడాది ఆఖరులోపు పూర్తి చేసి, పేదలకు అందించాలన్న లక్ష్యంతో అధికారులు పనులు చేయిస్తున్నారు. ఈ విషయంపై టిడ్కో నెల్లూరు ఈఈ మహేష్‌ను సంప్రదించగా ఇళ్లు అందుకోని లబ్ధిదారులు చెల్లించాల్సిన ఈఎంఐలను చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎవరెవరికి ఎంత బకాయిలు ఉన్నాయన్నది లెక్కిస్తున్నామని, త్వరలోనే జమ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

కందుకూరు-1లో పొగాకు వేలం ప్రారంభం

● కిలోకు రూ.280 ధర పలికిన మేలు రకం పొగాకు



పొగాకు వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు, రైతు ప్రతినిధులు

కందుకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కందుకూరు-1 పొగాకు వేలం కేంద్రంలో సోమవారం పొగాకు వేలం ప్రారంభమైంది. ఈ కేంద్రం పరిధిలోని తిమ్మపాలెం నుంచి 18 బేళ్లు వేలానికి రాగా కిలో పొగాకుకు రూ.280 ధర లభించింది. వేలం నిర్వహణాధికారి ఎం. కిరణ్ తొలిరోజు అన్ని బేళ్లు నాణ్యమైనవే వేలంకు రప్పించడంతో అన్నిబేళ్లకు అదే ధర దక్కింది. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ వేలం ప్రక్రియను పర్యవేక్షించారు. రైతు ప్రతినిధులు, రైతుసంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ తొలిరోజు ధర బాగానే ఉన్నా పొగాకు సాగుకి పెట్టుబడి వ్యయం పెరిగినందున మరింత ప్రోత్సాహకరమైన ధరలు ఇవ్వాలిలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు జీ. కొండారెడ్డి, తానికొండ రమణయ్య, బాలకోటయ్య, బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు,మన్నేపల్లి వరప్రసాదరావు పాల్గొన్నారు.

నాటి భోక్తల పాపం.. నేటి ఆదాయానికి శాపం!

- 'డీఎంహెచ్‌వో' ప్రాంగణంలో పాత భవనాల కూల్చివేత
- నాడు రూ.30 లక్షల విలువైన కలప తరలింపు
- నేడు రూ.1.67 లక్షలకే టెండర్లు

8

నక్కలగండిలో కలప దొంగలు

- అక్రమంగా వేప, చిల్లచెట్ల నరికివేత
- రూ. లక్షల్లో ప్రభుత్వ ఖజానాకు గండి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన కొంతమంది ఉద్యోగులు వ్యాపారులతో చేతులు కలిపి అక్రమ వ్యాపారానికి తెరలేపిన సంఘటన సోమవారం నక్కలగండి రిజర్వాయర్ ప్రాంతంలో వెలుగుచూసింది. గత కొన్ని రోజులుగా రిజర్వాయర్ ప్రాంగణంతో సహా ఆనకట్ట, వాగు ప్రాంతాల్లో ఉన్న విలువైన వేప, చిల్లచెట్లను నిబంధనలకు విరుద్ధంగా నరికి సమీపంలోని ప్రకాశం జిల్లాకు తరలిస్తున్నారు. ఉద్యోగుల అండతో ఎక్స్‌కవేటర్, యంత్రాలతో వేళ్లతో సహా చెట్లను పెకిలించి అక్కడే ముక్కలుగా నరికి యథేచ్ఛగా వాహనాల్లో తరలిస్తున్నారు. ఏళ్ల తరబడి ఏపుగా పెరిగిన లక్షల రూపాయల విలువ చేసే చెట్లకు తొలుత కూలీల ద్వారా నిప్పు పెట్టించి అనంతరం నరికిన కలపను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే ప్రాంగణం పరిశుభ్రంగా ఉంటుందనే ఉద్దేశంతో తామే చెట్లను నరికేందుకు అనుమతులు ఇచ్చామని ఆ శాఖలోని ఓ అధికారి బహిరంగంగానే చెబుతుండడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ముందస్తుగా పత్రికలకు సమాచారం అందించి వేలంపాట నిర్వహించాల్సి ఉంది. ఆవిధంగా వేలం దక్కించుకున్న వ్యక్తులకే రిజర్వాయర్ పరిధిలోని చెట్లను నరికే అవకాశం ఉంది. గతంలో అలాంటి విధానాలను అమలుచేసిన అధికారులు ప్రస్తుతం అందుకు విరుద్ధంగా వ్యవహరించడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


నరికివేయడంతో మోడుగా మిగిలిన చెట్లు


కర్రను వాహనంలోకి నింపుతున్న కూలీలు

పోలీసులకు డీఈ ఫిర్యాదు

కాగా, విషయం తెలుసుకున్న డీఈ రమణారావు చెట్లను తొలగించిన విషయం వాస్తవమేనని నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ రఘునాథ్ ఆదేశాలతో సిబ్బంది అక్కడికి చేరుకోవడంతో వాహనంలోని కర్రను అక్కడే వదిలేసి వ్యాపారులు పరారైనట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా కర్రను తరలించిన వ్యాపారులతో సహా ఉద్యోగుల ప్రమేయం ఉన్నట్లు తెలితే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.

జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని

- అచ్చయ్య, ఏపీవో



సంగం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని కల్పిస్తున్నామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో కె అచ్చయ్య పేర్కొన్నారు.

? మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో ఎంతమంది పనులకు వచ్చేవారున్నారు.

! మండలంలోని 20 పంచాయతీల్లో 8వేల జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 6వేల మంది కూలీలు పనులకు వస్తున్నారు.

? ఎన్ని పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు ఉన్నారు. క్షేత్ర సహాయకులు లేనిచోట్ల పనుల పరిస్థితి ఏమిటి.

! 20 పంచాయతీలకు గాను 13 పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు ఉన్నారు. మిగిలిన పంచాయతీల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సీనియర్ మేట్‌లతో ఉపాధి హామీ పనులు చేయిస్తున్నాం.

? ప్రస్తుతం ఎన్ని పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. ఏం పనులు చేస్తున్నారు. ఎంత మంది కూలీలు పనులకు వస్తున్నారు.

! ప్రస్తుతం ఆరు పంచాయతీల్లో పంట కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నారు. రోజుకు 300 మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

బీదకు సన్మానం

ఉదయగిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను సోమవారం అమరావతి సచివాలయంలో ఉదయగిరి ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, సీతారామపురం మండల టీడీపీ కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, టీడీపీ నాయకులు చింతనబోయిన శివకృష్ణ, ప్రవీణ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

ఏఎస్ పేట : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మహిళా ఉద్యోగులు, పొదుపు మహిళలకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి, చిరమణ పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతిరాణి, ఎంపీపీ పద్మజారెడ్డి, మహిళా ఉద్యోగులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

ఉదయగిరి : మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభలు మంగళవారం నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని ఏపీవో బీ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11న పుల్లాయపల్లి, జీ.అయ్యవారిపల్లి, జీ.చెరువుపల్లి, 12న ఆర్లపడియ, శకునాలపల్లి, నేలటూరు, 13న కృష్ణంపల్లి, గన్నేపల్లి, 14న జీ.చెర్లోపల్లి, 16న ఉదయగిరి, కొండాయపాళెం, బండగానిపల్లి, 17న దాసరిపల్లి, తిరుమలాపురం, వెంగళరావునగర్, అప్పసముద్రం, గండిపాళెం పంచాయతీల్లో గ్రామసభలు జరుగుతాయని ఆయన తెలిపారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి : సీపీఐ


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈసందర్భంగా బస్టాండ్ సెంటర్ నుంచి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు ఆర్డీవో పావనికి వినతిపత్రం అందచేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

అనంతసాగరం మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దళారులు, వ్యాపారులను నమ్మి మోసపోవద్దని మండల ఇన్‌చార్జి ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ రైతులకు సూచించారు. సోమవారం రేవూరు రైతు సేవాకేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ధరల వివరాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణరావు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆహార పొట్లాల పంపిణీ

ఉదయగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులకు సోమవారం అప్పసముద్రం ఆరోగ్య కార్యకర్త ఎండీ మన్సూర్‌అలీ తన సొంత నిధులతో ఆహార ప్యాకెట్లను వైద్యుడు ఠాగూర్ అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఏఎస్ పేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో జనసేన మండల అధ్యక్షుడు సయ్యద్ అక్బర్ బాషా ఆధ్వర్యంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. జనసేన పార్టీ నెల్లూరు సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కృష్ణారెడ్డి, రవి, జమీర్, హరీష్‌కుమార్, మృదుల చేతుల మీదుగా అట్టలు తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ నాయకులు చిరంజీవి, భాను కిరణ్, వంశీకుమార్, వెంకటేశర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌సెల్‌కు నాలుగు అర్జీలు

ఉదయగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు అర్జీలు అందినట్లు తహసీల్దారు సుభద్ర పేర్కొన్నారు. అర్జీలను పరిశీలించి పరిష్కార మార్గం చూపుతామన్నారు.

●దుత్తలూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు వై నాగరాజు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఆత్మకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో మేకపాటి క్యాంపు కార్యాలయంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య ఆధ్వర్యంలో యువత పోరు వాల్‌పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన నెల్లూరులో జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

14 నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ఉదయగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయ సమీపంలో నూతనంగా నిర్మించిన పోతురాజు సమేత గంగమ్మతల్లి శిఖర, కలశ, నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.5 లక్షలు, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య రూ.2 లక్షలు, మాజీ జడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి రూ.లక్ష, జడ్పీటీసీ మోడి రామంజనేయులు రూ.50 వేలు, గ్రామస్థులు, ఇతర దాతలు ఆర్థికసాయం అందజేశారన్నారు.

తలుపులు తెరుచుకోని ఆరోగ్య కేంద్రం

- రోగులకు అందని వైద్యం


తలుపులు తెరుచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా ఆరంభమైన విలేజ్ హెల్త్ క్లినిక్ వైద్య సేవలు పల్లెల్లో అందని ద్రాక్షగా మారింది. వసతుల సంగతి అటుంచితే కనీసం అక్కడి ఉద్యోగులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని అయోమయ పరిస్థితుల్లో ప్రజలు అవసలుఉ పడుతున్నారు. సోమవారం రామాపురంలో ఆరోగ్య కేంద్రం తాళాలు తెరువక పోవడంతో రోగులు గంటల తరబడి ఎదురుచూసి నిరాశగా వెనుతిరగాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఉన్నా ఉపయోగం లేకపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని రోగులు వాపోతున్నారు. జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతం కావడంతో ఉన్నతాధికారుల తనిఖీలు ఉండవనే ధీమాతోనే ఉద్యోగులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మారుమూల పల్లెల్లో రోగులకు సజావుగా వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి


సంగం: వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

సంగం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్‌లో ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో చలో పిఠాపురం వాల్‌పోస్టర్‌ను జనసేన నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 14వ తేదీన పిఠాపురంలోని చిత్రాడ గ్రామంలో నిర్వహించే పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమానికి ఆత్మకూరు నుంచి రెండు బస్సులు వెళ్తున్నట్లు, నాయకులు, పవన్ కల్యాణ్ అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మావిళ్ల ఆనంద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అధ్యక్షతన ఈనెల 14వ తేదీన పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ గ్రామంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ అక్బర్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా : ఈవోపీఆర్డీ


సీతారామపురం: చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ భార్గవి తదితరులు

సీతారామపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే జరిమానా తప్పదని ఈవోపీఆర్డీ భార్గవి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని సింగారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఈవోపీఆర్డీ ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం నివారించుటకు గ్రామంలోని ప్రతిఒక్కరూ వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామ ప్రజలు చెత్తను రోడ్లమీద కాని, బహిరంగ ప్రదేశాలు, డ్రైనేజీలో వేయరాదని, అతిక్రమించిన వారికి గ్రామ పంచాయతీచే జరిమానా విధించబడుతుందన్నారు. ఇంటిలోని తడి, పొడిచెత్తను గ్రీన్ అంబాసిడర్‌లకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సింగారెడ్డిపల్లి సర్పంచ్ దుర్గం సంపూర్ణమ్మ, కార్యదర్శి రాంనాథరెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● కలువాయి : దాచూరు పంచాయతీలో సోమవారం అధికారులు ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఇళ్ల వద్దకు పారిశుధ్య కార్మికులు వెళ్లి తడి, పొడి చెత్తలను వేరుగా సేకరించారు. వారానికి మూడు రోజులు చెత్త సేకరణ చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రాజుల అనురాధ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రమేష్, మండల రిసోర్స్ కోర్డినేటర్ పార్లపల్లి సునీల్, పంచాయతీ కార్యదర్శి డి లక్ష్మీ పాల్గొన్నారు.

మామిడిలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన


మామిడి చెట్లను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

సంగం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మామిడిలో వచ్చే తెగుళ్లు, వాటి నివారణపై ఉద్యానశాఖ అధికారి లక్ష్మి సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మండలంలోని కొరిమెర్లలో మామిడి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల మామిడికి నల్లతామర పురుగుల ఉధృతి పెరుగుతుందని, దీన్ని తొలి దశలోనే నివారించకపోతే కాయల మీద మచ్చలు ఏర్పడి కాయ నాణ్యత తగ్గే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం పలు తెగుళ్ల నివారణకు మామిడి రైతులకు సూచనలు చేశారు.

● చేజర్ల : మండలంలోని పలు గ్రామాలలో మామిడి చెట్లను ఉద్యానవన అధికారి పి లక్ష్మీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మామిడి రైతులకు నల్లతామర తెగుళ్ల నివారణ చర్యలను సూచించారు.

మత్స్య సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం


దాచూరు మత్స్యకార సంఘం పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న టీడీపీ నేతలు

కలువాయి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం పరిధిలోని దాచూరు, కలువాయి చెరువు ఆయకట్టు పరిధిలోని కలువాయి రెండు మత్స్యకారుల సంఘాలకు సోమవారం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. దాచూరు మత్స్యసంఘం అధ్యక్షుడిగా నాశనపు శివకుమార్, ఉపాధ్యక్షుడిగా ఇండ్ల గంగోజి, సెక్రటరీగా ఉదయగిరి పోలయ్య, డైరెక్టర్లుగా గాజుల పెంచలస్వామి, ఆవుల చిన పెంచలస్వామి, యాకసిరి రమేష్, మల్లికా పెంచలస్వామి, వింజేటి వెంకటేశ్వర్లు, కరిపోగు రమణయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, కావలి మత్స్యశాఖ ఏడీ ఎస్ శ్రీనివాసులు ప్రకటించారు. అలాగే కలువాయి మత్స్య సంఘం అధ్యక్షుడిగా వజ్రాల శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా పోట్లూరి చిన్న సుబ్బరాయుడు, సెక్రటరీగా ఆవుల వెంకట కృష్ణయ్య, డైరెక్టర్లుగా బండి పెంచలప్రసాద్, వజ్రాల సునీల్, దూడల పెంచలయ్య, గడ్డం శ్రీనివాసులు, అద్దూరి వెంకటేశ్వర్లు, మేకల పెంచలయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, పడుగుపాడు ఎఫ్‌డీవో పి శ్రీనివాసులు ప్రకటించారు. దాచూరు నూతన పాలకవర్గ సభ్యులను కలువాయి, రాపూరు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు నాయుడు, డి వెంకటేశ్వరరెడ్డి, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి నాయ కులు నువ్వుల శివరామకృష్ణ, సర్పంచు రాజుల అనురాధ, టీడీపీ నాయకులు జగదల్ నాయుడు, తదితరులు అభినందించారు.

సోమశిలలో 56.437 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి10 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 56.437 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 1,150, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

C.R.I.M.E N.E.W.S

లైంగిక వేధింపుల కేసులో జైలు, జరిమానా

నెల్లూరు(లీగల్), మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఓ బాలిక ఇంటికి వెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో ఎడమకంటి వెంకటేశ్వర్లుకి ఐదేళ్ల జైలు, రూ. 25వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి గ్రామానికి చెందిన ఎడమకంటి వెంకటేశ్వర్లు 2016 మార్చి 7వతేదీన అదే గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంటికి వెళ్లి లైంగిక వేధింపుకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆ బాలిక తన బంధువులకు చెబుతుండగా, వెంకటేశ్వర్లు తల్లిదండ్రులు, అన్నదమ్ములు వెళ్లి గొడవపడ్డారు. ఈ మేరకు మర్రిపాడు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో వెంకటేశ్వర్లుపై నేరం రుజువు కావడంతో పైవిధంగా జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. మిగతా నిందితులు గొడవ పడ్డారని రుజువు కావడంతో వారికి ఒక్కొక్కరికి రూ2 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దూబిశెట్టి చంద్రశేఖర్ వాదించారు.

బలవన్మరణానికి పాల్పడిన వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 10(ఆంధ్రజ్యోతి): భార్యాపిల్లలు దూరమయ్యారన్న మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధుడు నగరంలోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. పోలీసుల సమాచారం మేరకు, నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు అంబాపురానికి చెందిన ఆర్కట్ మురళీధర్ అలియాస్ మురళీ(65)కి వివాహమై పిల్లలున్నారు. నాలుగేళ్లక్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో అప్పటి నుంచి వేరుగా ఉంటున్నాడు. మురళీ ఆటోనడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన తిరుపతిలో ఉంటున్న తన చెల్లెలు నిర్మలకు శనివారం మధ్యాహ్నం ఫోన్ చేసి నగరంలోని హరిత లాడ్జీలో ఉన్నానని, భార్యాపిల్లలు దూరం కావడంత మనస్తాపం చెంది గడ్డి మందు తాగుతున్నానని చెప్పాడు. దీంతో ఆమె కుటుంబసభ్యులతో లాడ్జీ వద్దకు వచ్చి మురళీని ఆటోలో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయమై సోమవారం నిర్మల సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

నెల్లూరు(క్రైం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య చేసుకున్న కేసులో నగరంలోని సంతపేట పోలీసులు సోమవారం భర్తను అరెస్టు చేశారు. పొర్లుకట్టకు చెందిన మున్నా అలియాస్ రహతుల్లా, సమీనా (37) దంపతులు. భర్త వేధింపులు తట్టుకోలేక సమీనా ఆదివారం తన ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి బీబీజాన్ ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు భర్త మున్నాపై కేసు నమోదు చేశారు. మున్నాను సోమవారం పొర్లుకట్ట వద్ద అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

నెల్లూరురూరల్, మార్చి10,(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ద్వారా పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రూరల్‌లోని వడ్డిపాళెం ఎదురు ఓ అపార్టుమెంట్‌లో ఆన్‌లైన్ పేకాట నిర్వహిస్తున్నట్లు తమకు ఆదివారం రాత్రి సమాచారం అందిందని చెప్పారు. సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేయగా 9 మందితో పాటు రూ.15,400 నగదు, నాలుగు కార్లు, ఓ బైకు, 9 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారందరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● కలువాయి : మండలంలోని నూకనపల్లి సమీపంలోని పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం ఎస్‌ఐ సుమన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతు న్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.69,200 నగదు, 5 మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొగాకు బ్యారన్ల దగ్ధం

- రూ.7 లక్షల నష్టం

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో సోమవారం రాత్రి రెండు పొగాకు బ్యారన్లు దగ్ధమైన సంఘటన చోటుచేసుకొంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, పద్మావతిలకు చెందిన బ్యారన్లలో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ఆకురాలి గొట్టాలపై పడడంతో దగ్ధమయ్యాయి. ఈప్రమాదంలో ఒక బ్యారన్ పూర్తిగా, మరొక బ్యారన్ పాక్షికంగా కాలిపోయాయి. బ్యారన్ల దగ్ధంతో సుమారు రూ.7 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న ఉదయగిరి అగ్నిపమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

చోరీ యత్నం

- స్థానికులు గుర్తించడంతో మోటార్‌సైకిల్ వదిలి పరారీ

మనుబోలు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామపురంలోని ఓ చర్చి పక్కనే ఉన్న చిల్లర దుకాణంలో ఇద్దరు దుండగులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి ప్రయత్నించారు. మోటార్‌సైకిల్‌పై వచ్చి దుకాణం షట్టర్ తీసేందుకు ప్రయత్నిస్తుండగా అటుగా వెళుతున్న ఓ యువకుడు గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా రావడంతో చోరులు మోటార్‌సైకిల్ వదిలి పరారయ్యారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా ఘటనాస్థలానికి చేరుకుని మోటార్‌సైకిల్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- బీద రవిచంద్రతో మంత్రి లోకేష్


నామినేషన్ ప్రతులు అందజేస్తున్న బీద రవిచంద్ర, పక్కన పక్కన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కురుగొండ్ల, కావ్య, పాశిం

నెల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో అన్నారు. ఎమ్మెల్యే కోటాలో తనను టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసినందును సోమవారం ఆయన లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపా రు. కాగా, బీద రవిచంద్ర రెండు సెట్ల నామినేషన్లను అసెంబ్లీ ఆవరణ లో రిటర్నింగ్ అధికారికి అందజేశారు. మంత్రుల ద్వారా మొదటి సెట్ నామినేషన్‌ను, రెండో సెట్ నామినేషన్‌ను ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కావ్య కృష్ణారెడ్డి, పాశిం సునీల్ కుమార్‌లతో కలిసి అందించారు. వీరి వెంట ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు కూడా ఉన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, ఇతర నేతలు అమరావతిలో రవిచంద్రను కలిసి సన్మానించారు. కాగా రెండో సారి బీద రవిచంద్ర ఎమ్మెల్సీగా ఎన్నికకాబోతున్న నేపథ్యంలో నెల్లూరు లోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ కొండూరు పాలిశెట్టి, నాయకులు నన్నే సాహెబ్, కప్పిర రేవతి, ఉప్పు భాస్కర్, సురేంద్రబాబు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● అలాగే ఎమ్మెల్సీ అభ్యర్థి కావలి గ్రీష్మ నామినేషన్ దాఖలులో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా పాల్గొన్నారు.

చిన్నసైజు గుడ్లు సరఫరా..

- కేజీబీవీ, అంగన్‌వాడీ కేంద్రాలపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ

వలేటివారిపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు కాంట్రాక్టర్లు చిన్నసైజు గుడ్లు సరఫరా చేస్తున్నారు. మండలంలో 53అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భవతులు, బాలింతలు సుమారు 2వేల మందికి పైగానే ఉన్నారు. అలాగే కేజీబీవీలో 250మందికి పైగానే విద్యార్థినులు ఉన్నారు. వారందరికీ ప్రతి రోజూ మెనూలో భాగంగా గుడ్డు అందజేస్తున్నారు. నాణ్యత లేని నాసిరకం గుడ్లు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెలలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్‌కుమార్‌రెడ్డి మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గుడ్లు తూకం వేసి 40గ్రాములు లోపు బరువు ఉండటంతో కాంట్రాక్టర్‌కు స్వయంగా ఫోన్ చేసి చెప్పినా చిన్న సైజు గుడ్లు సరఫరా చేస్తూనే ఉన్నారు. ఎవరైనా లబ్ధిదారులు ఈ విషయంపై ప్రశ్నిస్తే తీసుకుంటే తీసుకో.. లేకపోతే వద్దని అంగన్‌వాడీ నిర్వాహకులు సమాధానమిస్తున్నట్లు సమాచారం. పర్యవేక్షణాధికారుల కనుసన్నల్లోనే ఈ వ్యవహారం నడుస్తుందని విమర్శలు ఉన్నాయి.

గుడ్ల మాయాజాలం..

గుడ్డు ఇస్తున్నారు కదా చిన్నదైతే నేమి అనుకోవచ్చు. జరిగే మాయాజాలం అంతా అందుల్లోనే ఉంది. సాధారణంగా నిర్ణీత బరువు 50 గ్రాములున్న గుడ్డును పంపిణీ చేయాలి. ఫారం కోళ్లు పెట్టే గుడ్లు చాలా వరకూ తగ్గుతుంటాయి. వీటిని సంబంధిత కాంట్రాక్టర్ ఏరివేసి కేంద్రాలకు చిన్నసైజు గుడ్లను సరఫరా చేస్తున్నారు. ఇవి అయితే తక్కువ ధరకే వస్తాయని వారి ఆలోచన. అందుకే చిన్న సైజు గుడ్లు సరఫరా చేస్తున్నారు. తక్కువ పరిమాణం కలిగిన గుడ్లతో లక్షల్లో కమిషన్ రూపంలో చేరుతోంది ఇప్పటికైనా పర్యవేక్షణాధికారులు స్పందించి చిన్న సైజు గుడ్ల సరఫరా చేసే కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



జమీన్‌ఉప్పలపాడులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం


కాంట్రాక్టర్ సరఫరా చేసిన గుడ్డు

తాగునీటి సరఫరా


ట్యాంకర్ వద్ద తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

అల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయిలో వేసవి సమీపించక ముందే తాగునీటి సమస్య వెంటాడుతోంది. మండలకేంద్రంలోని కొన్ని కాలనీల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో కెఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఆర్‌డీఆర్ కాలనీ, క్రిస్టియన్ పేట, ఇస్కపల్లి రోడ్డు ప్రాంతాల్లో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నీటి సమస్య ఏర్పడితే వేసవిలో ఏర్పడే సమస్య ఎంత జఠిలంగా ఉంటుందో అని స్థానికులు చర్చించు కుంటున్నారు.

14 అడుగలకు పడిపోయిన నీటిమట్టం

- రాళ్లపాడు ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 50.. అవుట్ ఫ్లో 100 క్యూసెక్కులు
- ఈ వేసవిలో తాగునీటికి ఢోకా లేదంటున్న అధికారులు


ప్రాజెక్టు పాత స్పిల్‌వేలో కిందపడిన ఒకటో నంబరు గేటు కౌంటర్ వెయిట్


రాళ్లపాడు ప్రాజెక్టులోని నీరు

లింగసముద్రం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 14 అడుగులకు పడిపోయింది. సోమశిల ప్రాజెక్టు నుండి ప్రస్తుతం ప్రాజెక్టులోకి 50 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోందని, ప్రాజెక్టు కుడి కాలువ నుండి 80క్యూసెక్కులు, ఎడమ కాలువ నుండి 20 క్యూసెక్కుల నీటిని వరి పైరుకు విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈ జి.చంద్రమౌళి చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ముందుగా వేసిన వరి పంట కోతలు ప్రారంభం అయినట్లు మరికొన్ని చిన్న పైర్లకు ఈ నెలాఖరు వరకు నీటిని సరఫరా చేస్తామన్నారు. అయినప్పటికీ ఈ వేసవిలో తాగు నీటికి ఢోకా లేదని భరోసా ఇస్తున్నారు. ప్రాజెక్టు ఆధారంగా పనిచేసే భారీ మంచినీటి పథకాల పరిధిలోని సుమారు 100 గ్రామాలకు రోజుకు 7క్యూసెక్కుల నీరు విడుదల అవుతోందని, ఆవిరి రూపంలో 10క్యూసెక్కుల నీరు వృథా అవుతుందని చెప్పారు. గతే డాది అక్టోబరు, నవంబరు నెలల్లో కురిసిన వర్షాలకు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 21.5 అడుగుల వరకు నీరు చేరింది. రెండుసార్లు కొద్ది మోతాదులో నీటిని ఒక గేటు మాత్రమే ఎత్తి మన్నేరుకు విడుదల చేశారు. వరి కోతలు వచ్చే నెల 15వ తేదీ నీటికి పూర్తి అవుతుందని, తర్వాత వేసే పత్తి పైరుకు ఒకటి రెండు తడుల నీరు నీరు ఇచ్చినా ఇబ్బంది లేదంటున్నారు.

కౌంటర్ వెయిట్ ఎప్పుడు తొలగిస్తారో..?

రాళ్లపాడు ప్రాజెక్టు పాత స్పిల్‌వేలో సుమారు 17ఏళ్ల కిందట 1,3గేట్ల కౌంటర్ వెయిట్ల చైన్లు తెగిపోవడంతో కౌంటర్ వెయిట్ ప్లాట్‌ఫాంపై కింద పడిపోయాయి. అప్పటినుండి అధికారులు వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోలేదు. 2007లో ప్రాజెక్టు పాత స్పిల్‌వేలోని క్రస్ట్‌గేట్లను అధికారులు ఆపరేట్ చేస్తుండగా 1, 3 గేట్ల చైన్లు తెగిపోవడంతో ఈ సమస్య నెల కొంది. పాత స్పిల్‌వేలోని గేట్లను అధికారులు ఆపరేట్ చేయక పోతుండడంతో వీటితో ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. అయితే భవిష్యత్తులో ప్రాజెక్టుకు భారీగా వరద వస్తే ఈ గేట్లను కూడా ఎత్తి నీటిని విడుదల చేస్తే ప్లాట్‌ఫాంపై ఉన్న ఈ కౌంటర్ వెయిట్లతో నీరు మన్నేరులోకి నేరుగా ప్రవహించే వీలు ఉండదు. నీటికి ప్లాట్ ఫాం దెబ్బతినే అవకాశం ఉంది. వీటిని తొల గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణలు తొలగించాలి

ఉలవపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కరేడు పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం ఎస్టీలకు చెందిన శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించాలని సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఎస్టీలతో కలిసి సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ మాట్లాడారు. గిరిజనులకు ప్రభుత్వం 2.89ఎకరాలు స్థలం కేటాయిస్తే దాన్ని కాలక్రమేణ కొద్దిమంది రైతులు ఆక్రమించుకొని జామాయిల్ సాగు చేయడం విచారకరం అన్నారు. ఈ విషయంపై పలుమార్లు పంచాయతీ, రెవెన్యూ అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అధికారుల వైపునుంచి స్పందన కరువడంతో గిరిజనులకు న్యాయం చేయాలని తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేపట్టామన్నారు. ఈ మేరకు తహసీల్దారు లావణ్యవేణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకురాలు పొన్నం రామలక్ష్మమ్మ, అంకమ్మరావు, వెంకటేశ్వర్లు, సుభాషిణి, భాస్కర్, జ్ఞానయ్య, రత్నకుమారి పాల్గొన్నారు.


తహసీల్దారు లావణ్యవేణికి వినతిపత్రం ఇస్తున్న రామకృష్ణాపురం వాసులు

పెరిగిన కరెంటు బిల్లులను తగ్గించాలి

కందుకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నివాసప్రాంతాల సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన కరెంటు చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు సోమవారం సుందరయ్య నగర్, జనార్దన గిరిజన కాలనీల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పెరిగిన కరెంటు బిల్లులను తగులబెట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్కే మల్లిక, ఎం.పద్మ, గౌస్, పవన్‌కుమార్, టీ.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

బిట్రగుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ చెంచులక్ష్మీపురంలోని బిజ్జం వెంకారెడ్డి (70) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి స్థానికులతో విచారణ చేపట్టారు. ఈ నెల 4వ తేదీన వెంకారెడ్డి ఇంట్లోనే పనిచేస్తున్న పనిమనిషి శాంతమ్మ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. వెంకారెడ్డి భార్య ఏడాది క్రితమే అనారోగ్యంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. నెల్లూరులో వైద్యుడిగా పని చేస్తున్న ఆయన కుమారుడు పెద్దిరెడ్డి తండ్రి మృతి తెలుసుకుని గ్రామానికి వచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. పెద్దిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

సోమశిల నీటి విడుదలపై ఆగ్రహం


- ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు బలిజేపల్లి

కావలి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల నీటిని సముద్రం పాలు చేస్తారా అని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు సోమవారం జిల్లా అధికారులను ప్రశ్నించారు. కావలి కాలువ పరిధిలోని గౌరవరం మేజర్ కాలువ 20రోజుల క్రితమే పంటలు కోతలు పూర్తియినా ఇప్పటికీ సోమశిల ఏఈ నీటిని విడుదల చేస్తున్నారని గడ్డి మోపులున్న పొలాల్లో నీటితో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కొందరు రైతులు రెండవ పంటగా పత్తి సాగుకోసం ఏఈకి ముడుపులు ముట్టాయని అందువలనే ఆయన గౌరవరం మేజర్‌కు నీటిని విడుదల చేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సివిల్ కోర్టు కేసుల పరిధిపై సమీక్షించాలి

- ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సివిల్ కోర్టులో కేసుల పరిధిపై సమీక్షించి జూనియర్ సివిల్ కోర్టులో కేసుల పరిధిని రూ.10లక్షలకు తగ్గించాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ విషయంపై సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. జూనియర్ సివిల్ కోర్టులో ప్రాం సరీనోట్లు, ఇతర డాక్యుమెంట్లు రూ.20లక్షల వరకు ఉన్నందున కేసుల సంఖ్య పెరిగి సత్వర న్యాయం జరుగటంలో ఆలస్యం అవుతోందన్నారు. ఆ దిశగా న్యాయశాఖ మంత్రి ఆలోచించాలని కోరారు.


సమస్యపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

అర్హత ఉన్న ప్రతి గిరిజనుడికి రుణాలివ్వాలి

కావలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా గిరి జనులకు రుణాలు ఇవ్వక పోవటం అన్యాయం అని దళిత సంఘర్షణసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి వాపోయారు. ఈ విషయంపై సోమవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఆర్డీవో ఎం. సన్నీవం శ్రీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడారు. గతంలో ఎస్సీ, ఎస్టీలకు ఆయా కార్పోరేషన్లతో రుణాలు ఇచ్చేవారని పేర్కొన్నారు. 7ఏళ్లుగా ఆ నిధులు ఆగిపోవడంతో తండావాసులు ప్రయివేట్ బ్యాంకులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అనంతరం జిల్లా యానాది సమాఖ్య అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ మాట్లాడారు. నెల రోజుల్లోగా కార్పొరేషన్ రుణాలివ్వకపోతే యానాదులతో కలసి ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, జెడ్డా వాసు, చలంచర్ల మహేష్, కత్తి శేషమ్మ పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన, దళితవర్గాలు

అంగన్‌వాడీల హామీలు అమలు చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కందుకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రాజెక్టు గౌరవాధ్యక్షుడు ఎస్ఏగౌస్ మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎం రాయుడు, ఆరుసెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం

కావలి టౌన్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కచ్చేరిమిట్టలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు అన్నవరం సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు బుర్రా శేషాచార్యులు అర్చక బృందం బ్రహ్మోత్సవ పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంకురార్పణ ధ్వజారోహణతో ప్రారంభమైన ఉత్సవాల్లో సోమవారం రాత్రి శ్రీవారు శేషవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తజనం అడుగడునా గ్రామోత్సవానికి బ్రహ్మారథం పట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు తిరివీది బ్రహ్మయ్య, తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


శేషవాహనంపై విహరిస్తున్న శ్రీవారు

సెల్‌ఫోన్‌కు యువత దూరంగా ఉండాలి

ఉలవపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): యువత సెల్‌ఫోన్ వినియోగం వలన చెడువైపే ఎక్కువగా నడుస్తున్నారని రామాయపట్నం మెరైన్ సీఐ శివన్నారాయణ అన్నారు. సోమవారం పెద్దపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరగాళ్లు, సెల్‌ఫోన్ మంచిచెడులపై విషయ పరిజ్ఞానం, వాతావరణం మార్పులు, తీరప్రాంత ప్రజలు అపరిచితులపై అవగాహన, సముద్ర ప్రయాణంలో తీసుకోవాలిసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐలు షరీఫ్, ఈశ్వరయ్య, సిబ్బంది, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెరైన్ సీఐ శివన్నారాయణ

కోఆపరేటివ్ ఫిషర్‌మన్ సొసైటీ అధ్యక్షుడిగా యల్లంటి

కావలి,మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక హరిజనపాలెం కోఆపరేటివ్ ఫిషర్‌మన్ సొసైటీ అధ్యక్షుడిగా యల్లంటి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫిషర్‌మ్యాన్ సొసైటీ కార్యాలయంలో కో ఆపరేటివ్ ఫిషర్‌మ్యాన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికలు జరిగాయి. మరలా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సహకారంతో అధ్యక్షుడిగా యల్లంటి వెంకటేశ్వర్లును మరోసారి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మార్పుడి మాచర్ల, ప్రధాన కార్యదర్శిగా మొలతాటి మేమలత, డైరెక్టర్లుగా శెట్టిపల్లి మాల్యాద్రి, యల్లంటి వెంకయ్య, గండూరు తిరుపతి, జూటూరి భాస్కరరావు, మారుపనూడి గోపాలరావు, కుందుర్తి శిరోమణిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేడికొండ సుకుమార్, జ్యోతి బాబూరావు, సుదర్శన్ రమేష్, మనోహర్ పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న యల్లంటి వెంకటేశ్వర్లు

యువత పోరు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కావలి టౌన్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి డిమాండు చేశారు. సోమవారం ముసునూరులోని ఆయన నివాసం వద్దనున్న క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈనెల 12న వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరు వీఆర్‌సీ మైదానం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు జరిగే కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డికి దమ్ముంటే కావలి అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకోవాలని ప్రతాప్‌కుమార్ రెడ్డి సవాల్ విసిరారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, తదితరులు

న్యూస్ బాక్స్

గ్రీవెన్స్‌కి నాలుగు వినతులు

కొండాపురం, మార్చి10(ఆంధ్రజ్యోతి): ప్రజావిజ్ఞప్తులదినం సందర్భంగా సోమవారం మండల కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి 4వినతులు వచ్చినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీవో ఆదినా రాయణ తెలిపారు. రెవెన్యూవిభాగంలోని రెండు వినతులలో పాసుపుస్తకాలపై వచ్చినట్లు తెలిపారు. అలాగే జీతాలు అందడం లేదని ఇస్కదామెర్ల పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు వినతులు అందజేశారు.

వైభవంగా సరస్వతీ పూజ


పరీక్ష సామగ్రిని అందజేస్తున్న వెంకటరమణయ్య, తదితరులు

కొండాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారుతి సోమవారం సరస్వతీపూజ నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని సరస్వతీ విగ్రహానికి పదో తరగతి విద్యార్థినులతో ప్రత్యేక పూజలు చేయించారు. తూర్పు పాలెంలోని శివనాగుల క్షేత్రం నిర్వాహకులు పైడి రాజేష్ సౌజన్యంతో గ్రామ టీడీపీ నాయకుడు మామిళ్లపల్లి వెంకట రమణయ్య 23మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలిగిరివాసికి పీహెచ్‌డీ




కలిగిరి, మార్చి, 10 (ఆంధ్రజ్యోతి):జాతీయ అత్యుత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత నందనవనం ప్రభాకరరావు కుమారుడు నందనవనం వెంకటసాయిచంద్ సీజర్ డిటెక్షన్ (మూర్ఛవ్యాధి)ని పసిగట్టు పరికరం అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించి పీహెచ్‌డీ పట్టాను పొందారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఎస్.గోపీ నాయక్ గారి మార్గదర్శనంలో మైసూరు విశ్వవిద్యాలయంలో న్యూరోటిక్ డికంపోజిషన్ బేస్డ్ ఫ్రేమ్ వర్క్ ఆన్ సీజర్ డిటెక్షన్ అంశంపై ప్రతిభ చూపాడు. సీజర్ డిటెక్షన్ అంటే మానవ మెదడు లేదా శరీరంలో సంభవించే అసాధారణ విద్యుత్ సంకేతాలను లేదా శారీరక మార్పులను గుర్తించడం.మూర్ఛ అపస్మారక (ఎపిలెప్సీ) స్థితిలోకి వెళ్లిన వక్తుల కోసం ఉపయోగించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు సాయిచంద్‌కు అభినందనలు తెలిపారు.

ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించాలి


చెత్తను సేకరిస్తున్న ఈవోపీఆర్డీ నయీమ్ తాజ్ హసన్

బిట్రగుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటినుంచి తడి, పొడి చెత్తను తప్పనిసరిగా సేకరించేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఈవోపీఆర్డీ నయీమ్ తాజ్ హసన్ అన్నారు. సోమవారం జక్కేపల్లి గూడూరు, సుందరగిరి వారి కండ్రిక, బోగోలులో కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్లలోని చెత్తను రోడ్లపై పారపోయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్స్‌కు అందజేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు జహీర్, చైతన్య, నరసింహులు, గ్రీన్ అంబాసిడర్లు, సిబ్బంది ఉన్నారు.

15 మద్యం సీసాల స్వాధీనం



కావలి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):పెదపట్టపుపాలెంలోని బెల్టు దుకాణంపై సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. అనధికారికంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న ఆవుల మౌలాలిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 15సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

కుంచించుకుపోతున్న పెద్దపవని రోడ్డు

కావలి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉదయగిరి రోడ్డు నుంచి పెద్దపవనికి వెళ్లే రోడ్డు కుచించుక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో పోసిన మట్టి కుప్పలు, తాగి పడేసిన కొబ్బరి బొండాల గుట్టలు ప్రమాదాలకు నిలయంగా మారాయని చెబుతున్నారు. దీనికితోడు రెండుకిరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు రోడ్డును కమ్మేస్తుండటంతో వాహనదారులు, ఆర్టీసీ బస్ డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పెద్దవనికి వెళ్లే రోడ్డు

అసంపూర్తిగా అదనపు గదుల నిర్మాణం

వలేటివారిపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌కు వైసీపీ హయాంలో నాడు-నేడు రెండోవిడత కింద నాబార్డు నిధులు రూ.95లక్షలు మంజూరు అయ్యాయి. వీటితో 8అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏమైందో తెలియదు కానీ పిల్లర్ల దశలోనే పనులు నిలిచిపోయాయి. మూడేళ్లయినా పనులు ప్రారంభం కాలేదు. హైస్కూల్‌లో 325మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సరిపడా గదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. అప్పట్లో ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతోనే ఈ పనులు అసంపూర్తిగా నిలిచిపోయినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు-నేడును తొలగించి మనబడి-మన భవిష్యత్‌గా పేరు మార్చింది. ఈ పథకంతోనైనా అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్కూల్ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

సిమెంట్ లేక నిలిచిపోయాయి

- శిరీషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వలేటివారిపాలెం

గత ప్రభుత్వం నిధులు విడుదల చేసి సిమెంట్ సరఫరా చేయకపోవడంతో ఆ నిధులను పక్క పాఠశాలలకు బదలాయించారు. మళ్లీ ఆ నిధులను అదనపు గదులు పనులకు విడుదల చేసే సరికి సిమెంట్ కొరత ఏర్పడింది. దీంతో పనులు నిలిచిపోయాయి.


పిల్లర్లకే పరిమితమైన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

524 పాఠశాలల్లో కంటి పరీక్షలు

- 4,801 మంది విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ
- అంధత్వ నివారణ సంస్థ జిల్లా మేనేజర్ డాక్టర్ శార్వాణి

నెల్లూరు (వైద్యం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 524 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కంటి పరీక్షలు నిర్వహించి, 4,801 మంది విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు అంధత్వ నివారణ సంస్థ జిల్లా మేనేజర్ డాక్టర్ శార్వాణి వివరించారు.



నెల్లూరులోని జీజీహెచ్‌లో గల జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు ప్రభు త్వ పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిం చామని చెప్పారు. ఆరు నుంచి 10వ తరగతి వరకు మొత్తం 1,05,520 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఇందులో 4,801 మందికి కంటిలో దోషాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వెంటనే కంటి అద్దాలు కావాలని ఉన్నతాధికారులను కోరగా, పంపించారన్నారు. వీటిని జనవరి, ఫిబ్రవరిల్లో విద్యార్థులకు అందచేశామన్నారు. రాష్ట్ర ప్రభు త్వం సహకారం అందించటం వల్లే కళ్లద్దాల పంపిణీ త్వరగా చేపట్టామన్నారు. అంతేకాక నేత్రవ్యాధు లకు విద్యార్థులకు అవగాహన కలిగించామని ఆమె వివరించారు.

కొండ బిట్రగుంటకు బస్సులు నడపాలి

నెల్లూరు(క్రైం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నుంచి కొండ బిట్రగుంటకు ఈనెల 12,13,14 తేదీల్లో బస్సులు నడపాలని నగరానికి చెందిన బీ రవికుమార్ డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో కోరారు. నెల్లూరువన్ డిపో పరిధిలో సోమవారం ఆర్టీసీ ప్రధాన బస్టాండులో డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరిగింది. ఐదుగురు ఫోన్ చేసి వారి సమస్యలు, అవసరాలు తెలిపారు. సర్వోదయ కళాశాల వద్ద ఆర్టీసీ బస్సులు నిలపడం ద్వారా ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని, నిలపకుండా చర్యలు చేపట్టాలని నగరానికి చెందిన ఆనంద్ కోరారు. నెల్లూరు నుంచి పామూరుకు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని ఎన్. నరసింహారావు కోరారు. నెల్లూరు మెయిన్ బస్టాండులో దోమల బెడద అధికంగా ఉందని దినేష్ అనే ప్రయాణికుడు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఎం మురళీకృష్ణ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆశలు

రాలుతున్నాయ్!

- మామిడిపూతపై చీడపీడల ప్రభావం
- రాలిపోతున్న పిందెలు
- వర్షం కోసం సాగుదారుల ఎదురుచూపులు
- వరుణుడు కరుణించకపోతే భారీ నష్టాలేనని ఆవేదన

ఉలవపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుక, ఎర్ర నేలల్లో మామిడి రైతులు సుమారు 5వేల ఎకరాల్లో మామిడి పంటలు సాగు చేశారు. ఈ సాగు లో పూతలు ఒక్కసారి కాకుండా విడతలవారీగా వచ్చాయి. డిసెంబరు, జనవరి మధ్య ముందు వచ్చిన పూతలు అడపాదడపా పిందెలుగా మారుతున్నా వెనకపడిన పూతలు పిందెలుగా మారకుండానే పూతకాడ దూపుడులు పడుతున్నాయి. రాత్రి, పగటి ఉష్ణోగ్రతల్లో మార్పు వలన తేనెమంచుతో పూతలు నల్లబారుతున్నాయి. దీనికితోడు త్రిప్స్ పూతలపై పెను ప్రభావం చూపుతుంది. పూతలు నింపుకోడానికే రైతులు కనీసం ఏడెనిమిదిసార్లు పురుగుమందులు పిచికారీ చేసినా నిలబడటం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో కౌలు రైతులు ఎక్కువగా ఈ పంట సాగు చేస్తుంటారు. కౌలురేటు కంటే చీడపీడల నుంచి పూతలు, పిందెలు కాపాడుకోడానికి ఖర్చు ఎక్కువగా అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందు వచ్చిన పూతలు పిందెకడుతున్నాయి వెనకవచ్చిన పూతలు నిలబడం లేదని, భీమవరం, బద్ధిపూడి, వీరేపల్లి, కృష్ణాపురం ఎర్ర నేలల్లో ఈ ఏడాది మామిడి పూతలు తక్కువైనా 20శాతం పూతలు నిలబడితే చాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- వర్షం కోసం ఎదురుచూస్తున్న మామిడి రైతు

నిలబడిన పూతలైనా పిందెలుగా మారితే కొంతలోకొంతైనా కాపు చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఒకవైపు మంచు మరొకవైపు అత్యధిక పగటి ఉష్ణోగ్రతలతో పూతపై త్రిప్స్ తీవ్ర ప్రభావం చూపుతోంది. మంచు ప్రభావంతో తేనెమంచు (నల్లతామర) బెడదతో ఆకులు, పూత, పిందెలు నల్లగామారి రాలిపోతున్నాయి. వీటన్నింటికీ ఉపసంహనం కలగాలంటే వర్షం పడితే చీడపీడలు ప్రభావం తగ్గి పిందెలకు, పూతకాడలకు బలం చేకూరుతుందని, తేమశాతం పెరుగుతుందని మామిడి రైతు చెబుతున్నారు.



కొమ్మలకు నిలబడక పూత రాలిపోవడంతో మిగిలిన కాడలు



చీడపీడలతో నల్లబారుతున్న మామిడి పూతలు

హిందువులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ వద్ద హిందూ చైతన్య వేదిక నేతల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హిందూ చైతన్య వేదిక నాయకులు, కార్యకర్తలు

నెల్లూరు (హరనాథపురం) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈనెల 4న జరిగిన వీరభద్రస్వామి పారువేట ఉత్సవం సందర్భంగా, అన్య మతస్థులు హిందువులపై దాడి చేశారని, దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హిందూ ఐక్యవేదిక నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దాడి చేసిన వారిని అదుపు చేయడంలో పోలీసులు విఫలమవడమే కాకుండా, పక్షపాత ధోరణితో హిందువులపైనే లాఠీచార్జీ చేశారని విమర్శించారు. ఉత్సవంపై అన్యమతస్థులు దాడిచేస్తే హిందువులను, హిందూ సంస్థలను బాధ్యులను చేస్తూ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. దేశభక్తి సంస్థలైన ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ పేర్లు పెట్టి మరీ కేసులు పెట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు ఉమామహేష్, కార్యదర్శి నాగశ్రీనివాసులు, ఇతర నాయకులు కాకు మురళీరెడ్డి, శశి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 21,946 మంది హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షల్లో భాగంగా సోమవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథ్స్-2బీ, జువాలజీ-2, హిస్టరీ-2, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 21,946 మంది హాజరయ్యారు. పరీక్షల ప్రారంభానికి ముందు ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బందికి పలు సూచనలు చేసి ప్రశ్నపత్రాలను ఆయా కేంద్రాలకు పంపించారు. అనంతరం ఆయన ఆరు కేంద్రాలను పరిశీలించగా, డీవీఈవో ఒకటి, డీఈసీ మూడు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ 24 కేంద్రాలను పరిశీలించాయి.

12 మంది అడ్మిన్లకు షోకాజు నోటీసులు

నెల్లూరు(సిటీ), మార్చి10,(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆస్తి పన్ను వసూళ్లలో వెనకబడిన 12 సచివాలయాల అడ్మిన్లకు ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ సోమవా రం షోకాజు నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తోపాటు లక్ష్యాలు చేరుకోవడంలో ప్రతిభ చూపలేకపోతున్నారని ఆక్షేపించారు. దీంతో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని కోరుతూ షోకాజు నోటీసులిచ్చారు. ప్రస్తుత పన్నుల్లో నూరుశాతం, బకాయిల్లో 75శాతం వసూళ్లు చేయడంలో ఈనెల 7న జీరో వసూళ్లు చూపారని, ఇందుకుగాను వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. కాగా బడ్వాడీపాళెం దగ్గర కొత్తగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఆయన సోమవారం రాత్రి పరిశీలించారు.

స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు

ప్రత్యేక కార్యాచరణ : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో 12నెలలపాటు చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రకటించిందని చెప్పారు. ఈ మేరకు ప్రతి నెలా మూడో శనివారం జిల్లాలో ఆయా శాఖల పరిధిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు యాక్షన్ ప్లాన్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకు ముందుగానే అందించాలని ఆదేశించారు. కార్యక్రమాల అమలులో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జేసీ కే. కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు నాగరాజకుమారి, గంగాభవానీ, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చైతన్య, డీఈవో బాలాజీరావు, డీటీసీ చందర్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా సర్వే అధికారి నాగశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

అర్జీదారులకు భోజనం

సోమవారం తిక్కనభవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది అర్జీదారులు రావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. 309 మంది తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలు అందజేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారికి మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించారు. దీంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అంబేడ్కర్ వర్సిటీని ఏర్పాటు చేయాలి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థులు కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తెలంగాణా ప్రభుత్వం ఆ యూనివర్సిటీకి సంబంధించి అడ్మిషన్లను ఆపేసిందని తెలిపారు. దీంతో దూరవిద్యలో చదవాలనుకునే విద్యార్థులు నష్టపోయారన్నారు.

లస్కర్లను నియమించాలి

పంట పొలాలకు నీళ్ల వదిలేందుకు లస్కర్లను నియమించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.మాబు, నాయకులు దుంపల సుబ్బారావు, కమలాకర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. 2023 - 24లో లస్కర్లు లేనందున 20 టీఎంసీల నీరు వృథా అయ్యాయని చెప్పారు.

నమ్మి మోసపోయాం.. ఆదుకోండి!

- ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీకి పలువురి వినతి

నెల్లూరు(క్రైం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'నమ్మించి మోసం చేశారు.. మీరు తప్ప మాకు ఎవరూ లేరు... ఆదుకోండి సార్.. అంటూ ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను పలువురు కోరారు. సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 73 మంది బాధితులు వచ్చి పోలీసు అధికారులకు వినతులు అందించారు.

- నగరంలోని వేదాయపాలెం పరిధిలో నివాసం ఉంటున్న వారి కంపెనీలో ఐటీ లావాదేవీలు చూస్తానని, తాను చార్టెడ్ అకౌంటెంట్‌ను అని కోవూరుకు చెందిన సురేష్ నమ్మించాడు. రూ.1.27 కోట్లు తీసుకొన్నాడని, ఐటీ కట్టలేదని జీఎస్టీ నుంచి నోటీసులు అందడంతో సురేష్ గురించి విచారిస్తే నిజం తెలిసి మోసపోయామని గ్రహించి భార్యభర్తలు వచ్చి న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.
- తన పెద్ద కుమారుడు తన బాగోగులు చూసుకుంటానని నమ్మించి, ఆస్తిమొత్తం రాయించుకొని తనని చూసుకోకుండా ఇబ్బందులు పెడుతున్నాడని నగరంలోని సంతపేటకు చెందిన ఓ వృద్ధుడి వాపోయాడు.
- బోగోలు మండలం జువ్వలదిన్నెకి చెందిన వ్యక్తికి నెల్లూరుకు చెందిన డానియల్ ద్వారా ప్రమీల అనే మహిళ తిరుపతి గోశాలలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.3 లక్షల నగదు తీసుకుంది. అయితే ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశారని ఆ మహిళ ఫిర్యాదు చేసింది.
- నవాబుపేటకి చెందిన ఓ మహిళను బాలాజీనగర్ పరిధికి చెందిన శశిధర్, ఈశ్వరయ్యలు తన వ్యాపారానికి తోట్పాటును అందిస్తామని బ్యాంకులో లోన్ ఇప్పిస్తామని నమ్మించారు. ఆమె వద్ద అన్ని కాగితాలు తీసుకొని ఆమెకు తెలియకుండానే రూ.10 లక్షల లోను తీసుకొని మోసగించారు. వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరారు.
- బుచ్చికి చెందిన ఒంటరి మహిళ వద్ద శ్రీధర్‌రెడ్డి, మోహన్‌లు రిజిస్ట్రేషన్ పత్రాన్ని ఫొటోలు తీసుకెళ్లి తనకే తెలియకుండా తన స్థలాన్ని అమ్మేశారని, విచారించి న్యాయం చేయాలని ఆ మహిళ కోరింది.



బాధితుడి సమస్య వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

నాటి భోక్తల పాపం నేటి ఆదాయానికి శాపం

- 'డీఎంహెచ్‌వో' ప్రాంగణంలో పాత భవనాల కూల్చివేత
- నాడు రూ.30 లక్షల విలువైన కలప తరలింపు
- తెరవెనుక నాటి ఎమ్మెల్యే అనుచరులు
- నేడు రూ.1.67 లక్షలకే టెండర్లు

నెల్లూరు (వైద్యం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో పాత భవనాల కూల్చివేతలో ఆ శాఖ తీవ్రంగా నష్టపోయే అవకాశం వచ్చింది. పాత భవనాల్లో ఇమిడివున్న రూ.30 లక్షల విలువైన టేకు కలపను గత ఏడాదే అక్రమంగా తరలించుకుపోయారు. ప్రస్తుతం కేవలం రూ.1.67 లక్షలకే టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అనుచరులు వైద్య ఆరోగ్య శాఖ వెనుక వైపు ఉన్న భవనాలను అక్రమంగా కూల్చి వేసి కలపను తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం సెల వురోజుల్లోనే ఈ అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీనిపై అప్పటి డీఎంహెచ్‌వో పెంచలయ్యపై కూడా విమర్శలు వచ్చాయి. దాదాపు రూ.30 లక్షల విలువైన రంగూన్ టేకు వంటి కలపను గుట్టుచప్పుడు కాకుండా తరలించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఉద్యోగులు వ్యతిరేకించినా డీఎంహెచ్‌వో ఆగ్రహం వ్యక్తం చేయటంతో వారు మౌనం దాల్చినట్లు తెలుస్తోంది. అప్పట్లో ఆంధ్రజ్యోతిలో కథనాలు వెలువడటంతో ఆఖరిలో అక్రమాల తొలగింపు ఆగిపోయింది. లేదంటే పూర్తిగా పాత భవనాలను కూల్చివేసి విలువైన కలపను తరలించుకు పోయేవారన్న ఆరోపణలు వచ్చాయి. తాజాగా మంత్రి నారాయణ ఆదేశాలతో ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఇందుకు టెండర్లు పిలిచారు. రూ.1.67 లక్షలకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఉన్న కొద్దిపాటి భవనాలను కూల్చివేసి కలపను సేకరిస్తున్నారు. భవనాల కూల్చివేతలో వస్తున్న రబ్బీస్‌ను వాహనాల ద్వారా తరలిస్తున్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలోని పాత భవనాలను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

అప్పటి డీఎంహెచ్‌వో తీరుపై

గత ఏడాది జనవరిలో పాత భవనాల కూల్చివేతకు అధికారులు నిర్ణయించారు. ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా ప్రతిపాదనలు తయారు చేయించాలని భావించారు. రూ.32 లక్షల అంచనాలతో పాత భవనాల కూల్చివేతకు టెండర్లు పిలవాల్సి ఉంది. అయితే, ఇవేమి లేకుండా అర్ధంతరంగా పాత భవనాలను కూల్చి వేయడం అనేక అనుమానాలకు తావిచ్చింది. అప్పటి ఎమ్మెల్యే అనిల్ ఒత్తిడితో టెండర్లు పిలవకుండా ఎలాంటి అనుమతులు లేకుండా వైసీపీ అనుచరులకు ఈ పనిని అప్పగించడం, పాతభవనాలను కూల్చి వేస్తున్నా అప్పటి డీఎంహెచ్‌వో మౌనం దాల్చారు. గతంలో డీఎంహెచ్‌వో కార్యాలయం ముందే వైద్యాధికారులు సొంత నిర్ణయం తీసుకుని 4 పాత భవనాల కూల్చివేశారు. ఇందులో ఉన్న కలపనూ బయటకు తరలించారన్న విమర్శలున్నాయి. దీనిపై నేటికీ అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. విచారణ కూడా చేపట్టక పోవటం అనుమానాలకు తావిస్తోంది.

చాలా తక్కువకే అప్పగించాం

గతంలో వైద్య ఆరోగ్య శాఖలో పాత భవనాలు చాలా ఉండేవని అధికారులు చెబుతున్నారు. రూ.32 లక్షలకుపైగా పాత భవనాల కూల్చివేతకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఎందుకో అప్పట్లో అధికారులు టెండర్లు పిలవలేదు. అక్రమార్కులు ఈ పాత భవనాలను కూల్చి వేసి కలపను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పాత భవనాలను తొలగించాలని మంత్రి నారాయణ ఆదేశించడంతో టెండర్లు పిలిచి చాలా తక్కువకే పనులు అప్పగించాము.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

డిగ్రీ పరీక్షలకు 387 మంది గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివ ర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలలో 387 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 64 మంది విద్యార్థులకు 57 మంది హాజరు కాగా 7 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 6,868 మంది విద్యార్థులకు 6,488 మంది హాజరు కాగా 380 మంది గైర్హాజరయ్యారు.

బీఈడీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో సోమవారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలలో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలలో 1,214 మంది విద్యార్థులకు 1,132 మంది హాజరు కాగా 82 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. కాగా తిరుపతి జిల్లా గూడూరులోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నెల్లూరులోని వీఆర్ ఐపీఎస్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

బాగు చేస్తే బకింగే

- ఆక్రమణలతో కుంచించుకుపోయిన బకింగ్‌హామ్ కెనాల్
- బ్రిటీష్ హయాంలో కొనసాగిన జల రవాణా
- అభివృద్ధి చేస్తే తీరప్రాంతవాసులకు ప్రయోజనం
- కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి

ఇందుకూరుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగునాట జల రవాణా అంటే ముందుగా గుర్తొచ్చేది బకింగ్ హామ్ కెనాల్. దేశంలో రోడ్డు రవాణా వ్యవస్థ అంతగా లేనప్పుడు జలమార్గం ప్రధానంగా ఉండేది. బ్రిటీష్ కాలం నుంచి తీర ప్రాంతంలో కాకినాడ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని పుదుచ్చేరి వరకు ఈ కెనాల్ ద్వారా జలరవాణా జరుగుతుండేది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 12 తీర ప్రాంత మండలాలను తాకుతూ 165 కి.మీ. పొడవున ఈ కెనాల్ విస్తరించి ఉంది. అప్పట్లో కలప, ఆయిల్స్ ఇతరత్రా వస్తువులు ఈ మార్గం నుంచి రవాణా జరుగుతుండేవి. స్వాతంత్ర్యం వచ్చాక రోడ్డు రవాణాకు ఇచ్చిన ప్రాధాన్యతను పాలకులు జల మార్గానికి ఇవ్వకపోవడంతో క్రమంగా ఈ కెనాల్‌లో రవాణా నిలిచిపోయింది. సుమారు 70ఏళ్లుగా ఈ కాలువను పట్టించుకోకపోవడంతో ఆక్రమణల చెరలో చిక్కుకుంది. జాతీయ జలమార్గాల చట్టం 2016 ప్రకారం దేశంలో ఇలాంటి 111 మార్గాలను గుర్తించారు. ఇందులో ఇన్‌లాండ్ వేజల్స్‌వే 4గా బకింగ్‌హామ్ కెనాల్‌ను పేర్కొన్నారు.



గుర్రపు డెక్క తుంగతో నిండిన బకింగ్‌హాం కెనాల్

బ్రిటీష్‌కాలంలో ఈ కాలువ వెడల్పు 32 మీటర్లు కాగా, నేడు 10మీటర్లు కూడా లేదు. దీన్ని వినియోగంలోకి తెచ్చి కొత్త పోర్టులతో సముద్ర మార్గానికి అనుబంధంగా అంతర్గత జల రవాణాన్ని అందుబాటులోకి తీసుకురాగలిగే జలరవాణాకు జీవం పోసినట్టే. 1880 నుంచి 1950 వరకు తక్కువ ఖర్చుతో సరుకు రవాణా చేయడానికి ఈ జలమార్గం ఎంతో ఉపయోగపడింది. ఒకానొక సమయంలో రోజుకు కోటి టన్నుల బరువైన సరుకులను ఈ కాలువ ద్వారా రవాణా చేశారంటే ఆశ్చర్యం కలగమానదు. అంతేకాక శ్రీహరికోట నుంచి చెన్నైకి అవసరమైన వంట చెరుకును ఈ కాలువ ద్వారానే భారీగా ఎగుమతి చేసేవారు. సరుకు రవాణా సమయంలో అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకోవడానికి కాలువ ఒడ్డున మద్రాసు నుంచి కాకినాడ వరకు 50 పైగా ట్రావెలర్స్ బంగ్లాలను నిర్మించారు. ఈ కెనాల్ భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను కూడా ఏర్పాటు చేసింది. తీరం పొడవున దాదాపు 150 మందికిపైగా ఇన్‌స్పెక్టర్లను కాలువ ప్రవాహ వేగాన్ని సమీక్షిస్తూ.. ప్రతిరోజు బ్రిటీష్ ప్రభుత్వానికి నివేదికలు అందించేవారు. కాలువ మధ్యలో గేట్ల దగ్గర మరికొంతమంది సిబ్బంది విధుల్లో ఉండేవారు. కాలువ వినియోగం తగ్గాక ఆ సిబ్బందిని నీటిపారుదల శాఖలో విలీనం చేశారు. తాము చిన్నతనంలో తెరచాప పడవల ద్వారా ఆ కాలువలో సరుకులు తరలించడం చూశామని మండలవాసులు చెబుతుంటారు.

ఆశలన్నీ 'ప్రశాంతమ్మ'పైనే...

కొత్త చట్టం ప్రకారం బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణ జరిగితే రాష్ట్రానికి చాలా మేలు జరిగి పారిశ్రామిక పురోగతికి తోడ్పడుతుంది. అయితే అందుకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంది. ఇప్పటికే కేంద్రం పలుమార్లు పరిశీలనలు చేసింది. కొన్ని ప్రతిపాదనలు కూడా వచ్చాయి. ఎంతమంది ఎమ్మెల్యేలు మారినా ఈ కెనాల్ పునరుద్ధరణకు కృషి చేసిన ఎమ్మెల్యేలు ఎవరూ లేరు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కెనాల్ పునరుద్ధరణపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తన వాణి వినిపిస్తారని ఆశిద్దాం.



రోడ్డుపై మురికినీరు

- కాలనీవాసుల అవస్థలు

వింజమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీలో మురికినీరు పోయే దారిలేక రోడ్డుమీదికి వదిలిపెట్టడంతో దుర్గంధం వెదజల్లుతూ దోమలు స్వైర విహారం చేస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న కాలనీలో మురికి కాలువల్లేక రోడ్డు మీదకి మురికినీరు చేరడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై మురికినీరు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	92
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8295
వెండి కిలో ధర	రూ. 1,00,100
వెండి ఒక గ్రాము	రూ. 103.10

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● వెంకట రాజేష్, రాపూరు ఎస్సై

రాపూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు స్థానిక ఎస్సై వెంకటరాజేష్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.



ముఖాముఖి

? గ్రామాల్లో నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టారు.

! గ్రామాల్లో నేరాలనియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల కూడళ్లలో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం. మండలంలో అన్ని గ్రామాల్లో 100 సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

? ద్విచక్ర వాహనదారులకు ఎటువంటి సూచనలు ఇస్తున్నారు.

! ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి, వాహనానికి సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ పక్కాగా ఉండాలి, అవిలేకుండా నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తున్నాం.

? నేరాలు, సైబర్ నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి.

! పాఠశాలలు, కళాశాలలను సందర్శించి మహిళా చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

? రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! ముందుగా జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించాం. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు జిగ్ జాగ్ పద్ధతిలో బారికేడ్లు ఏర్పాటుచేస్తూ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

వంతెనలపై రక్షణ ఏదీ..!?

● కనుపూరు కాలువపై కూలిన రక్షణ గోడలు

● తరచూ ప్రమాదాలు

● రెండేళ్ల కిందట కాలువలోకి దూసుకెళ్లి కారు





పొలిచెర్లపాడు మార్గంలో కనుపూరు కాలువ వంతెనలపై దెబ్బతిన్న రక్షణ గోడలు

వెంకటాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సాగునీటి కాలువలపై రక్షణ కరువైంది. వంతెనలపై నిర్మించిన రక్షణ గోడలు కూలిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతోన్నా యి. దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలపై పర్యవేక్షణ లేకపోవడం, సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో కొన్ని వంతెనలు శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు రక్షణ గోడలు కూలిపోయాయి. ఫలితంగా ఆ రక్షణ లేని ఆ వంతెనలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. కొన్ని గ్రామాల్లో వంతెనల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతోన్నాయి. వీటికి శాశ్వత పరిష్కారం చూపించాల్సిన ధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వెంకటాచలం మండలంలోని కసుమూరు నుంచి పొలిచెర్లపాడు మీ దుగా పొదలకూరు, వెంకటాచలం నుంచి కందలపాడు మీదుగా ఆమంచర్లకు రోడ్డు మార్గాలున్నా యి. కానీ ఈ మార్గాల్లో ఉన్న వంతెనలు దశాబ్దాల క్రితం నిర్మించారు. దీంతో ప్రధానంగా కనుపూరు కాలువపై నిర్మించిన వంతెనలైతే అధ్వానంగా ఉన్నాయి. రక్షణ గోడలు కూలిపోయి రోడ్డు ప్రమాదాలకు నిలయాలుగా మారిపోయాయి. ముఖ్యంగా కసుమూరు మస్తాన్ వలీ దర్గాకు వచ్చే యాత్రికులు పొలిచెర్లపాడు మీదుగా పొదలకూరుకు వెళ్లి అటు నుంచి కడప, ఏఎస్ పేట దర్గాకు వెళ్లడానికి ఇదే ప్రధానమార్గం. అలాగే పొలిచెర్లపాడు సమీపంలో క్వారీ ఉం డడంతో కంకర టిప్పర్లు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే పొలిచెర్లపాడు మీదుగా వెళ్లే సమయంలో కనుపూరు కాలువపై రెండు వంతెనలు ఉండగా అవి రెండు శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి నెలకొంది. కనీసం రక్షణ గోడలు కూడా సక్రమంగా లేకపోవడంతో ఇప్పటికే పలు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. రెండేళ్ల కిందట ఒక కారు నేరుగా కనుపూరు కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నా యి. కానీ అధికారులలో మాత్రం చలనం రావడం లేదు. కనుపూరు కాలువపై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు కావడంతో రక్షణ గోడలు ధ్వంసమై కూలిపోవడంతోపాటు వంతెన రోడ్డు ఇరుకుగా ఉండడం, అటు, ఇటుగా రెండు మలుపుల వల్ల రాత్రి సమయాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని వాహనదారులు భయపడుతున్నారు. భారీ వాహనాలు, కంకర టిప్పర్లు ఎక్కువగా ఈ మార్గంలో తిరుగుతుంటాయి. ఈ వంతెన వద్ద రెండు వాహనాలు ఎదురైతే.. ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోవాల్సిందే. రక్షణ గోడ లు కూలిపోయి ప్రమాదభరితంగా ఉన్నప్పటికీ వంతెన వద్ద కనీస మరమ్మతులు చేపట్టి జాగ్రత్త చర్యలు చేయకుండా గాలికి వదిలేశారు. ఉన్నతాధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి. కనుపూరు కాలువపై కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కండలేరు నీటి సామర్థ్యం 50.81 టీఎంసీలు

రాపూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న కండలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 68 టీయంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 50.81 టీయంసీలు ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల మరియు ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో 1095 క్యూసెక్కులుగా ఉందని అయన తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుండి 825 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 110 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 160 క్యూసెక్కులు చొప్పున 1095 క్యూసెక్కులు నీరు అవుట్‌ఫ్లో అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

వైభవంగా లక్ష్మీహయగ్రీవ పూజ



లక్ష్మీహయగ్రీవ పూజ నిర్వహిస్తున్న పండితులు

పొదలకూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీగోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో భాగవత సప్తాహ వేడుకల్లో భాగంగా రెండవ రోజు సోమవారం లక్ష్మీహయగ్రీవ పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల రమణయ్య నాయుడు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో రుత్వికులు హయగ్రీవ యాగాన్ని నిర్వహించారు. పట్టణంలోని నాగార్జున ఇంగ్లీషు మీడియం, నారాయణ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ ఈ పూజ పిల్లల్లో జ్ఞానం పెంచేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యకు అధిపతిగా, జ్ఞాన ప్రదాతగా పూజలందుకునే హయగ్రీవ స్వామిని ఆరాధిస్తే జ్ఞానానికి లోటుండదని శాస్త్ర వచనమన్నారు. దేవీపురాణం, స్కంధ పురాణం, శ్రీమద్భాగవతంతోపాటు ఆగమ శాస్త్రాల్లో కూడా హయగ్రీవుని ప్రస్తావన ఉందన్నారు. లక్ష్మీ సమేతుడైన హయగ్రీవుడిని ఆరాధిస్తే వారు జ్ఞానసిద్ధి కలిగి విద్యలో రాణిస్తారని, విజయంతోపాటు సంపద పొందుతారని సాక్షాత్తు జగజ్జనని పార్వతీదేవి వరం ఇచ్చిందన్నారు. అనంతరం విద్యార్థులు తమ పుస్తకాలను, పదో తరగతి హాల్ టికెట్లను పూజల్లో ఉంచారు. ఈ కార్యక్రమంలో గంగినేని రవీంద్రనాథ్, గీతాంజలి, రాయపనేని శివప్రసాద్, స్వర్ణ, పెండ్యాల సుధీర్‌నాయుడు, లక్ష్మి, సురేష్‌నాయుడు, స్వప్న పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పొదలకూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపల్లిలో ఐతా కాశయ్య అనే కల్లుగీత కార్మికుడు ఇటీవల ఈతచెట్టుపై నుంచి కిందపడి మృతి చెందగా సోమవారం ఆ కార్మికుడి కుటుంబాన్ని గౌడ సంఘం నేతలు పరామర్శించారు. రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోసూరు రాజశేఖర్‌గౌడ్, తోట ప్రభాకర్‌గౌడ్, ఉప్పల రామకృష్ణయ్యగౌడ్, తాతా రమణయ్యగౌడ్, వెంపులూరు శ్రీనివాసులుగౌడ్, అన్నం సుబ్బారావు గౌడ్, తాళ్ల రాజాగౌడ్, బడుగు చెంచుప్రసాద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్‌కు 2600 ఎకరాల భూమి అవసరమా?

● అసెంబ్లీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి



ముత్తుకూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ముత్తుకూరు మండలం కృష్ణపట్నం వద్ద రియలన్స్ సంస్థ పెట్టే పరిశ్రమలకు 2600 ఎకరాల భూమి అవసరమా అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి సోమవారం అసెంబ్లీలో ప్రశ్నించారు. పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం 2008లో 2600 ఎకరాల భూమిని రిలయన్స్ సంస్థకు అప్పగించారన్నారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఆ భూముల్లో 2029 నాటికి రూ.20వేల కోట్లతో రెండు యూనిట్లు పెడతామని రిలయన్స్ సంస్థ చెప్తోందని, ఆ కంపెనీ పెట్టే పరిశ్రమలకు అంత భూమి అవసరం ఉందా అనే అంశాన్ని పరిశీలించి, మిగిలిన భూములను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఇతర పరిశ్రమలకు అప్పగించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 10 ఎకరాల నుంచి వెయ్యి ఎకరాల వరకు ఎంత భూమి ఉన్నా సేకరించి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం శుభపరిణామమన్నారు. స్థానికులకు ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తోటపల్లిగూడూరు మండలం కోడూరు బీచ్‌పై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

తిక్కన వాటిక పార్కును అభివృద్ధి చేస్తాం

రాపూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిక్కన వాటిక పార్కును అభివృద్ధి చేస్తామని రాపూరు మండల టీడీపీ నాయకుడు, పెంచలకోన మాజీ చెర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం తిక్కన వాటిక పార్కును సందర్శించిన ఆయన అభివృద్ధి పనులపై అధికారులను ఆరా తీశారు. పార్కులో ముళ్ల చెట్ల తొలగింపు, పార్కు చుట్టూ ప్రహరీ, వాచ్‌మెన్ నియామకం తదితర సమస్యలపై త్వరలో అభివృద్ధి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల పంచాయతీరాజ్ ఏఈ వాసు, మండల టీడీపీ నాయకులు నల్లవడ్ల వెంకటరమణారెడ్డి, మధురెడ్డి, మార్కెటింగ్ మాజీ ప్రెసిడెంట్ గంగిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల ఆరోపణలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది!

విడవలూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రైతులను నానా విధాలుగా ఇబ్బందులకు గురి చేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయ్యడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి పొన్నలూరు పురంధర్‌రెడ్డి, మాతూరు శ్రీనివాసులురెడ్డిలు ఎద్దేవా చేశారు. విడవలూరులో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు సొసైటీ ముసుగులో మిల్లర్లతో కుమ్మక్కై లక్షలు దండుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పూండ్ల యోసోబు, ఆవుల రవిచంద్ర, ఆవుల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'మహాయోగ' సేవలు అభినందనీయం



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహాయోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దొడ్ల కోదండరామిరెడ్డి సహకారంతో ప్రతి నెలా బుచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమని బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ప్రశంసించారు. సోమవారం ఆసుపత్రిలో పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు, బాలింతలకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజతో కలసి ఆమె గుడ్లు, పండ్లు, ప్రొటీన్ పౌడర్, వేరుశనగ ముద్దలు, పెరుగన్నం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దొడ్ల కోదండరామిరెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సహన, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తోటపల్లిగూడూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట అంబేడ్కర్ రెబల్ రాయల్స్ సహకారంతో ఇసుకపాలెం సర్పంచు ఇంగిలాల చైతన్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను సోమవారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈదూరు మస్తాన్, చైతన్య, మనోహర్, మిథున్ పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవంలో యువత బీభత్సం

తోటపల్లిగూడూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాలక్ష్మీపురంలో సోమవారం జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఈ క్రమంలో వెంకటేశ్వర పట్టపుపాళెం, ముత్యాలలోవు పట్టపుపాలెం గ్రామాలకు చెందిన కొందరు యువకులు పాఠశాలకు వచ్చి సౌండ్ సిస్టమ్, ఉపాధ్యాయుల సెల్‌ఫోన్‌లు ధ్వంసం చేశారు. అడ్డు వచ్చిన విద్యార్థులపై దాడి చేయడంతో ప్రధానోపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సావిత్రీబాయి ఫూలేకి ఘన నివాళి



పొదలకూరు:సావిత్రీబాయిపూలేకి నివాళులర్పిస్తున్న నాయకులు



వెంకటాచలం:సావిత్రీబాయి పూలేకి జనసేన నేతల నివాళి

పొదలకూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావుపూలే సతీమణి సావిత్రిబాయిపూలే వర్ధంతి కార్యక్రమం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జమున హాల్ సమీపంలో నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊకోటి లక్ష్మీనారాయణ, నాయకులు చొప్పా వెంకటేశ్వర్లు, కోడూరు మస్తానయ్య, ఉప్పలపాటి మస్తానయ్య, బత్తారు మురళి, గుమ్మా మోహన్‌రావు, కండే వెంకటేశ్వర్లు, మాడా రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాచలం : వెంకటాచలంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణిభవాని, కాకి శివకుమార్, నారదాసు రవి, సందూరి శ్రీహరి, కంటే సుధాకర్, మణి, అశోక్, మస్తాన్, సుమన్ పాల్గొన్నారు.

పిడూరుపాళెం మత్స్యసంఘం ఎన్నిక ఏకగ్రీవం



కొత్త పాలకవర్గానికి నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి సుధీర్

మనుబోలు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడూరుపాళెం మత్స్య సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. 102 మంది సభ్యులు ఉన్న ఈ సంఘానికి కొత్త పాలకవర్గం ఏర్పాటుకు సంబంధించిన ఎన్నికను సోమవారం మత్స్యశాఖ అధికారులు స్థానిక కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. 9 మంది సభ్యులతో పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయింది. సంఘం అధ్యక్షుడిగా వల్లమేటి రవి, ఉపాధ్యక్షుడుగా చెమిర్తిపల్లి సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా గెరికి కృష్ణయ్యను, ఆరుగురి సభ్యులను ఎన్నుకున్నారని ఎన్నికల అధికారి జీ.సుధీర్ తెలిపారు. వారికి ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ పాలకవర్గం 5 ఏళ్ల పాటు నడుస్తుందని, చక్కగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. కొత్త పాలకవర్గాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఏలు సురేష్, బాబురాజు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు ఇవ్వొద్దు

మనుబోలు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు ఇచ్చి మోసపోయే కంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ఇచ్చి మద్దతు ధర పొందాలని అధికారులు రైతులను కోరారు. మండలంలోని గురవిందపూడి గ్రామంలో ధాన్యం ఆరబోసుకున్న ప్రాంతాలకు వ్యవసాయాధికారి జహీర్, ఎంపీడీవో జలజాక్షి సోమవారం వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఇర్షాద్, పంచాయతీ కార్యదర్శి బీ.జయంతి, టీడీపీ నాయకులు సర్వేపల్లి శివకుమార్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

ముత్తుకూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : బీపీసీఎల్ కంపెనీ నిర్మించనున్న పైప్‌లైన్‌తో నష్టపోతున్న రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య తెలిపారు. ముత్తుకూరులోని శ్రామిక భవన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన ముత్తుకూరులో పైపులైన్ బాధిత రైతుల సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని కృష్ణపట్నం, ముత్తుకూరు, పిడతాపోలూరు, మామిడిపూడి గ్రామ పొలాల్లో ఏర్పాటు అవుతున్న ఈ పైపులైను వలన రైతులకు తీవ్రమైన నష్టం కలుగుతుందన్నారు. బీపీసీఎల్ యాజమాన్యం న్యాయమైన పరిహారం ఇవ్వకుండా, తూతూమంత్రంగా పరిహారం ఇచ్చి రైతులను అన్యాయం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. పెట్రోలియం, మినరల్స్ పైప్‌లైన్ భూ సేకరణ చట్టం 2013 ప్రకారం మార్కెట్ విలువకు 4రెట్లు అదనంగా చెల్లించాలని, పైప్‌లైన్‌ను భూమిలో 15 అడుగుల లోపల ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు జరుగుతున్న తీవ్రమైన అన్యాయంపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలన్నారు.

పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



పక్కా ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కోవూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో గుమ్మళ్లదిబ్బ కాలనీలో చేపట్టిన పక్కా ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర సోమవారం గుమ్మళ్ల దిబ్బ కాలనీకి చేరుకుంది. అసంపూర్తిగా మిగిలిన పక్కా ఇళ్లను యాత్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మండల కమిటీ కార్యదర్శి గండవరపు శేషయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఇళ్ల నిర్మాణం పునాదులకే పరిమితం అయిందన్నారు. దీంతో పేదలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ యాత్రలో సీపీఎం నాయకులు తిరివీధి రమేష్, బట్టా పెద్దబ్బయ్య, ఎస్‌కే అఫ్రోజ్, వవ్వేటి మల్లికార్జునరెడ్డి, ఎండీ సర్దార్ అహమ్మద్, గండవరపు సురేష్, ఊటుకూరు రమణయ్య పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

లైంగిక వేధింపుల కేసులో జైలు, జరిమానా

నెల్లూరు(లీగల్), మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఓ బాలిక ఇంటికి వెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో ఎడమకంటి వెంకటేశ్వర్లుకి ఐదేళ్ల జైలు, రూ. 25వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి గ్రామానికి చెందిన ఎడమకంటి వెంకటేశ్వర్లు 2016 మార్చి 7వతేదీన అదే గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంటికి వెళ్లి లైంగిక వేధింపుకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆ బాలిక తన బంధువులకు చెబుతుండగా, వెంకటేశ్వర్లు తల్లిదండ్రులు, అన్నదమ్ములు వెళ్లి గొడవపడ్డారు. ఈ మేరకు మర్రిపాడు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో వెంకటేశ్వర్లుపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ళ జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. మిగతా నిందితులు గొడవ పడ్డారని రుజువు కావడంతో వారికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దూబిశెట్టి చంద్రశేఖర్ వాదించారు.

బలవన్మరణానికి పాల్పడిన వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 10(ఆంధ్రజ్యోతి): భార్యాపిల్లలు దూరమయ్యారన్న మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధుడు నగరంలోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. పోలీసుల సమాచారం మేరకు, నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు అంబాపురానికి చెందిన ఆర్కట్ మురళీధర్ అలియాస్ మురళీ(65)కి వివాహమై పిల్లలున్నారు. నాలుగేళ్లక్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో అప్పటి నుంచి వేరుగా ఉంటున్నాడు. మురళీ ఆటోనడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన తిరుపతిలో ఉంటున్న తన చెల్లెలు నిర్మలకు శనివారం మధ్యాహ్నం ఫోన్ చేసి నగరంలోని హరిత లాడ్జీలో ఉన్నానని, భార్యాపిల్లలు దూరం కావడంత మనస్తాపం చెంది గడ్డి మందు తాగుతున్నానని చెప్పాడు. దీంతో ఆమె కుటుంబసభ్యులతో లాడ్జీ వద్దకు వచ్చి మురళీని ఆటోలో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయమై సోమవారం నిర్మల సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

నెల్లూరు(క్రైం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య చేసుకున్న కేసులో నగరంలోని సంతపేట పోలీసులు సోమవారం భర్తను అరెస్టు చేశారు. పొర్లుకట్టకు చెందిన మున్నా అలియాస్ రహతుల్లా, సమీనా (37) దంపతులు. భర్త వేధింపులు తట్టుకోలేక సమీనా ఆదివారం తన ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి బీబీజాన్ ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు భర్త మున్నాపై కేసు నమోదు చేశారు. మున్నాను సోమవారం పొర్లుకట్ట వద్ద అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

నెల్లూరురూరల్, మార్చి10,(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ద్వారా పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రూరల్‌లోని వడ్డిపాళెం ఎదురు ఓ అపార్టుమెంట్‌లో ఆన్‌లైన్ పేకాట నిర్వహిస్తున్నట్లు తమకు ఆదివారం రాత్రి సమాచారం అందిందని చెప్పారు. సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేయగా 9 మందితో పాటు రూ.15,400 నగదు, నాలుగు కార్లు, ఓ బైకు, 9 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారందరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● కలువాయి : మండలంలోని నూకనపల్లి సమీపంలోని పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం ఎస్‌ఐ సుమన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతు న్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.69,200 నగదు, 5 మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొగాకు బ్యారన్ల దగ్ధం

● రూ.7 లక్షల నష్టం

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో సోమవారం రాత్రి రెండు పొగాకు బ్యారన్లు దగ్ధమైన సంఘటన చోటుచేసుకొంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, పద్మావతిలకు చెందిన బ్యారన్లలో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ఆకురాలి గొట్టాలపై పడడంతో దగ్ధమయ్యాయి. ఈప్రమాదంలో ఒక బ్యారన్ పూర్తిగా, మరొక బ్యారన్ పాక్షికంగా కాలిపోయాయి. బ్యారన్ల దగ్ధంతో సుమారు రూ.7 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న ఉదయగిరి అగ్నిపమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

చోరీ యత్నం

● స్థానికులు గుర్తించడంతో మోటార్‌సైకిల్ వదిలి పరారీ

మనుబోలు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామపురంలోని ఓ చర్చి పక్కనే ఉన్న చిల్లర దుకాణంలో ఇద్దరు దుండగులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి ప్రయత్నించారు. మోటార్‌సైకిల్‌పై వచ్చి దుకాణం షట్టర్ తీసేందుకు ప్రయత్నిస్తుండగా అటుగా వెళుతున్న ఓ యువకుడు గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా రావడంతో చోరులు మోటార్‌సైకిల్ వదిలి పరారయ్యారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా ఘటనాస్థలానికి చేరుకుని మోటార్‌సైకిల్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయండి

● బీద రవిచంద్రతో మంత్రి లోకేష్



నామినేషన్ ప్రతులు అందజేస్తున్న బీద రవిచంద్ర, పక్కన పక్కన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కురుగొండ్ల, కావ్య, పాశం

నెల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో అన్నారు. ఎమ్మెల్యే కోటాలో తనను టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసినందును సోమవారం ఆయన లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపా రు. కాగా, బీద రవిచంద్ర రెండు సెట్ల నామినేషన్లను అసెంబ్లీ ఆవరణ లో రిటర్నింగ్ అధికారికి అందజేశారు. మంత్రుల ద్వారా మొదటి సెట్ నామినేషన్‌ను, రెండో సెట్ నామినేషన్‌ను ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కావ్య కృష్ణారెడ్డి, పాశం సునీల్ కుమార్‌లతో కలిసి అందించారు. వీరి వెంట ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు కూడా ఉన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య ఇతర నేతలు అమరావతిలో రవిచంద్రను కలిసి సన్మానించారు. కాగా రెండో సారి బీద రవిచంద్ర ఎమ్మెల్సీగా ఎన్నికకాబోతున్న నేపథ్యంలో నెల్లూరు లోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ కొండూరు పాలిశెట్టి, నాయకులు నన్నే సాహేబ్, కప్పిర రేవతి, ఉప్పు భాస్కర్, సురేంద్రబాబు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● అలాగే ఎమ్మెల్సీ అభ్యర్థి కావలి గ్రీష్మ నామినేషన్ దాఖలులో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్లలో

దాహం.. దాహం!

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్టాండ్లలో తాగునీటికి అవస్థలు పడాల్సి వస్తున్నది. టికెట్‌తోపాటు సెస్ పేరుతో రూ.2 నుంచి రూ.8 వరకు అదనంగా అధికారులు వసూలు చేస్తున్నారు. అయితే స్వచ్ఛమైన తాగునీరు అందించే స్థితిలో ఆర్టీసీ లేదు. వేసవి వస్తుందంటే బస్టాండ్లకు వచ్చే ప్రయాణికులకు తాగునీటి కష్టాలు మొదలైనట్లే. జిల్లా వ్యాప్తంగా ఉన్న బస్టాండుల్లో తాగునీరు ఉండకపోవడంతో ప్రయాణికులు డబ్బులు చెల్లించి తాగుతున్నారు. ఈ సంవత్సరం అయినా ఆ పరిస్థితులు మారుతాయనుకుంటే ఆ దిశగా అడుగులు పడడం లేదు.



ప్రధాన బస్టాండ్‌లో తాగునీటితో చేతులు కడుగుతున్న ప్రయాణికులు

● స్వచ్ఛందంగా అందచేసినా...

వేసవి వస్తుదంటే స్వచ్ఛంద సంస్థలు, దాతలు, ప్రభుత్వ సంస్థలు ఎవరికి వారుగా ముందుకు వచ్చి తాగునీటిని ఉచితంగా అందిస్తుంటారు. ప్రధాన కూడళ్లలో పోటీ పడి చలివేంద్రాలు, ఆర్‌వో ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తుంటారు. అయితే నిత్యం ప్రయాణాలు చేసే ఆర్టీసీ బస్టాండుల్లో మాత్రం తాగునీరు వెతికినా కన్పించవు.

● సెస్ నగదు ఏమవుతుంది ?

ఎక్స్‌ప్రెస్ నుంచి ఆర్డీనరీ వరకు బస్సుచార్జీతో పాటు టోల్‌చార్జీ, సెస్ చార్జీలను కలుపుకొని వసూలు చేస్తున్నారు. ఇది రూ.2 నుంచి రూ.8 వరకు ఉంటుంది. ఇలా ప్రయాణికులు ఎన్నిసార్లు టికెట్లు తీసుకుంటే అన్నిసార్లు సెస్ చెల్లిస్తూనే ఉంటారు. ఈ క్రమంలో రోజుకు సుమారు రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఆదాయం వస్తుంది. నెలకు రూ.1.50 కోట్ల వరకు నగదు సెస్ పేరుతో ఆర్టీసీకి అందుతుంది. మరి బస్టాండ్లలో తాగునీటి సౌకర్యం ఎందుకు కల్పించలేదో అర్థం కావడం లేదు.

● వ్యాపారుల దందా

బస్టాండ్లలోని స్టాళ్లను బాడుగకు తీసుకున్న వ్యాపారస్తులు ఎప్పుడెప్పుడు వేసవి కాలం వస్తుందా అని ఎదురుచూస్తుంటారు. వేసవి నీటి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయల్లా ఉంటుందంటూ వారు అంటుంటారు. అరలీటరు నీరు రూ.5 అమ్ముతారంటే ప్రయాణికులను ఎలా దోచుకుంటున్నారో అర్థం అవుతుంది. ఇకనైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, బస్టాండ్లలో తాగునీటి వసతి కల్పించాలి.

● వేలాదిమందికి రెండు,మూడు కుళాయిలే..!

జిల్లాలోని ఆర్టీసీ బస్టాండుల్లో నిత్యం వేలాదిమంది ప్రయాణాలు చేస్తుంటారు. అయితే తాగునీటి కోసం ఏర్పాటు చేసిన కుళాయి లు మాత్రం రెండు లేక మూడు మాత్రమే ఉంటాయి. అవి కూడా షెల్టర్లు లేకపోవడం, ఆ కుళాయిల నుంచే మరుగుదొడ్లకు నీరు పంపుతుండటం, తాగునీటి కుళాయిల వద్ద పాచి, చెత్త నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తుంది.

- ఆర్టీసీలో స్వచ్ఛ నీటి కోసం ఎదురుచూపు
- వేలాదిమందికి రెండు, మూడు కుళాయిలే..
- వ్యర్థాల మధ్య తాగునీరు
- సెస్ పేరుతో రూ.కోట్లలో వసూలు



కుళాయి నీటితో షాపు ముందు కడుగుతున్న మహిళ



ఆత్మకూరు బస్టాండ్ తాగునీటితో పళ్లెం శుభ్రం చేస్తున్న వ్యక్తి

ప్రజల విజ్ఞప్తులకు తక్షణం

పరిష్కారం చూపాలి

సిటీ కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నగర వాసుల నుంచి అందుకున్న విజ్ఞప్తులకు తక్షణ పరిష్కారం చూపాలని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న ఆయన నగర ప్రజల నుంచి విన్నపాలు అందుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పౌరుడి నుంచి అర్జీ అందుకున్నాక క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవాలు పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. నగరంలో 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం కలిగిన ప్లాస్టిక్ కవర్లకు అనుమతి లేదన్నారు.అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా 14వ డివిజన్‌లో పారిశుధ్య పనులను పరిశీలించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్

కరాటేలో మోక్షితకు రజతం

నెల్లూరు(విద్య), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏడీపై పాఠశాలకు చెందిన మోక్షిత ఇటీవల విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయస్థాయి కరాటే కటా విభాగంలో రజత పతకం సాధించినట్లు పాఠశాల డైరెక్టర్స్ కే.నరేష్‌రెడ్డి, డాక్టర్ వెంకట్‌రావు తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థిని అంతర్జాతీయస్థాయి కరాటేలో పతకం సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. అలాగే మరో విద్యార్థిని పీ .రాస్య కూడా చిలకలూరిపేటలో జరిగిన జాతీయస్థాయి కరాటేలో వెండి పతకం దక్కించుకుందన్నారు. అనంతరం విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఫణిబాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.



రవాణాశాఖ అధికారుల స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హరనాథపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి క్రింద రవాణాశాఖ అధికారులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్లకు నెంబరు ప్లేట్ల పరిశీలన, అద్దాలకు ఫిల్మ్ వేసి ఉన్న వాహనాలు, పత్రాలు పరిశీలన.. ఇలా పలు అంశాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారులు మాట్లాడుతూ నెంబరు ప్లేట్లు సరిగా లేని వాహనాలు, డార్క్ ఫిల్మ్ కారు అద్దాలకు వేసిన వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. కారు యజమానులు, డ్రైవర్లు తప్పనిసరిగా కారుకు సంబంధించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని, సరైన నెంబరు ప్లేట్‌లు నిబంధనల మేరకు అమర్చుకోవాలని, డార్క్ ఫిల్మ్ వాహనాలకు అతికించకూడదని, నిబంధనలు అతిక్రమించి స్టిక్కర్లు అంటించరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై అపరాధరుసుం విధిస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎంవీవో షఫీ, ఏఎంవీఐలు పవన్, కార్తీక్, రఘువర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

శంకుస్థాపన చేసిన రెండునెలల్లోనే పనులు

నెల్లూరురూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రోజునుంచి 60 రోజుల్లో ప్రారంభోత్సవం ఉంటుందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం 24,28,30 డివిజన్లలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి సీసీరోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలు గుర్తించి పనులు ఎంపిక జరుగుతుందన్నారు. నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా అనుకున్న సమయానికి పనులు పూర్తిచేస్తామని తెలిపారు.



శంకుస్థాపన ప్రాంతంలో గిరిధర్‌రెడ్డి, నాయకులు

రంగడి బ్రహ్మోత్సవాలకు

ప్రత్యేక ఏర్పాట్లు

● ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తారు. స్వామి వారికి గరుడ సేవ, కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాల ఏర్పాట్ల ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఆంధ్రజ్యోతికి వివరించారు.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

?: బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ఎలా..

!: యాత్రికులను ఆకట్టుకునేలా రంగడి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రత్యేక విద్యుద్దీపాలకరణలు, క్యూలైన్లు, చలువ పందిళ్లు, తాగునీరు సౌకర్యాలతోపాటు ఉచిత ప్రసాదాల పంపిణీకి సన్నాహాలు చేశాం.

? : ఇతర శాఖల సహకారం.

! : ఇతర శాఖలు సంపూర్ణంగా సేవలు అందిస్తున్నాయి. పోలీసుశాఖ ఆధ్వర్యంలో భక్తులకు భద్రత, ట్రాఫిక్, క్యూలైన్ల ఏర్పాటు చేశారు. ఫైర్ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ, నగర పాలక సంస్థ, విద్యుత్ శాఖలు వారికి కేటాయించిన పనులు చేస్తున్నారు.

? : బ్రహ్మోత్సవాల్లో విశేష దినాలు.

! : ఈ బ్రహ్మోత్సవాల్లో 14న బంగారు గరుడసేవ, 15న కల్యాణం, 16న రథోత్సవం జరగనున్నాయి.

? : సాంస్కృతిక కార్యక్రమాల వివరాలు.

! : భక్తుల వినోదం కోసం సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశాం. ఇందు కోసం ప్రత్యేక వేదికను తయారు చేశాం. ప్రతీరోజు రాత్రి 7 నుంచి 9గంటల వరకు ఇవి జరుగుతాయి.



చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

పేదలకు చీరల పంపిణీ

నెల్లూరు (వైద్యం) మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నేత, ఎస్‌కేబీ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ షేక్ అల్లాఉద్దీన్ సోమవారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. నగరంలోని వెంగళరావు నగర్ మసీదు వద్ద రంజాన్ మాసాన్ని పురష్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నేతలు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, షేక్ మహమ్మద్ హనీఫ్, మల్లికార్జునరెడ్డి, రెహమాన్, సుధీర్, నూర్జహాన్, బద్రి, నరేంద్ర పాల్గొన్నారు.

కాంగ్రెస్ నగర కమిటీ ఎంపిక

నెల్లూరు (వైద్యం) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగర నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సోమవారం ప్రకటించారు. సిటీ అధ్యక్షుడిగా నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శిగా వావిటపర్తి సుధీర్, ఉపాధ్యక్షులుగా సంజయ్‌కుమార్, షేక్ అల్లాబక్షు, చాగంటి సుస్మితారెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ ప్రసాద్, అదనపు కార్యదర్శిగా నాగిరెడ్డి రాజేష్, కోశాధికారిగా చీపినాపి ధనుంజయ్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కమిటీని డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి అభినందించారు.

రవీంద్రబాబుకు మంత్రి, ఎంపీ నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పత్తి రవీంద్రబాబు అంత్యక్రియలు సోమవారం జరిగాయి. అంతకు ముందు ఆయన గృహానికి వెళ్లి పార్థివ దేహానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.



రవీంద్రబాబు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నెల్లూరు(విద్య), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సుంకు చెంగన్న నగరపాలక ఉన్నత పాఠశాలలో సోమవారం టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం కే.అరవింద మాట్లాడుతూ దాతలు ఎంఎస్.రెడ్డి, డాక్టర్ ఇంద్రసీల్‌లు కలిసి పరీక్ష సామగ్రి, జిప్ ఫైల్స్‌ను అందచేశారన్నారు. వీరు గతంలోనే ఇద్దరు విద్యార్థినులను దత్తత తీసుకున్నారని, వారికి వస్త్రాలు బహూకరించి టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీవీ.సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, వాకర్స్ సంఘాల నేతలు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి అందచేస్తున్న దాతలు

యానాది కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయండి

అసెంబ్లీలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి

నెల్లూరు (హరనాథపురం) మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : యానాది కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సోమవారం అసెంబ్లీలో కోరారు. నారా లోకేష్ పాదయాత్రలో యానాదుల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తా మని చెప్పారని, ఆ హామీని అమలు చేయాలని కోరారు. కోవూరు నియోజకవర్గంలో 30వేల మంది గిరిజనులు ఉన్నారని, వారు ఉండే కాలనీల్లో ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సచివాలయ స్థాయిలో నోడల్ ఆఫీసర్ నియమించి గిరిజనులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. యానాదులకు ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా చేపల వేటకు వలలు, సైకిళ్లు, ఆటోలు అందించాలని ఆమె తెలిపారు. దళిత గిరిజనుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.



'జయభారత్'కు డయాలసిస్ యంత్రాల వితరణ



డయాలసిస్ యంత్రాలకు పూజలు చేస్తున్న శాంతిలాల్ జైన్

నెల్లూరు (వైద్యం) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జయభారత్ ఆసుపత్రికి రూ. 12 లక్షల విలువ చేసే రెండు డయాలసిస్ యంత్రాలను భగవాన్ మహావీర్ ఛారిటబుల్ ట్రస్ట్ వారు బహూకరించారు. జైన్ సేవాసదన్ సహకారంతో ట్రస్ట్ చొరవతో సోమవారం సేవాసదన్ అధ్యక్షుడు శాంతిలాల్‌జైన్ ఈ యంత్రాలను ఆసుపత్రి కమిటీ కోశాధికారి గుర్రం సుధాకర్‌కు అందచేశారు. అనంతరం జైన్ మాట్లాడుతూ గతంలో అందించిన 10 యంత్రాలతో డయాలసిస్ యూనిట్ రోగులకు సేవలు అందిస్తుండగా, ప్రస్తుతం 20 యంత్రాలతో నాలుగు షిఫ్ట్‌ల్లో సేవలు అందిస్తుందని తెలిపారు. సోహన్లాల్ జైన్ షష్ఠి పూర్తి సందర్భంగా కూడా ఐసీయూ విభాగాన్ని ఆధునీకరించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సురేంద్రకుమార్, మహావీర్ ట్రస్ట్ కార్యదర్శి జేపీ జైన్, సభ్యులు పరస్మాల్ జైన్, మిశ్రమాల జైన్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే బాటలో మహిళలు నడవాలి : ఐద్వా

నెల్లూరు (వైద్యం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి ఉపాధ్యాయురాలు, సంఘం సంస్కర్త సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని, ఆమె బాటలోనే మహిళలు నడవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) పిలుపునిచ్చింది. సోమవారం సాయిత్రీబాయి 128వ వర్ధంతి సందర్భంగా నగరంలోని మినీబైపాస్‌లో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమారి, షేక్ మస్తాన్‌బీ మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ఆమె ఎంతో కృషి చేసారని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షురాలు సుబ్బమ్మ, షేక్ షంషాద్, నాగలక్ష్మి, షేక్ రహనూమ తదితరులు పాల్గొన్నారు

● నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని మినీబైపాస్‌లో ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మురళీ, హరి, రమేష్, ప్రతాప్ రామ్మోహన్ పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నైతిక విలువలతోనే దేశాభివృద్ధి సాధ్యం

నెల్లూరు (వైద్యం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలతోనే దేశాభివృద్ధి సాధ్యమని బెంగళూరుకి చెందిన బ్రహ్మకుమారి ఆశ్రమ రాజయోగిని చాయ వెల్లడించారు. సోమవారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఓ నర్సింగ్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా సమాజం, కుటుంబం, దేశం గురించి ఆలోచించాలన్నారు. పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా రాజయోగిని ఛాయ, నగర ఇన్‌చార్జి ఈశ్వరి సిస్టర్‌లను శాలువాలతో సన్మానించారు. పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, సుమతి, శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగా

పాముల వీధికి వాల్వు కట్ చేశారు..

● రెండు నెలలుగా నీరు అందక అవస్థలు

పొదలకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గత సార్వత్రిక ఎన్నికల్లో తమలో అధిక భాగం తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేశామనే అక్కసుతో పంచాయతీ పాలకులు ఉద్దేశపూర్వకంగా గత రెండు నెలల నుంచి నీరు సక్రమంగా రాకుండా పంచాయతీ తాగునీటి వాల్వ్‌ని తిప్పేశారని పట్టణంలోని పాములవీధికి చెందిన ప్రజలు ఆరోపించారు. తాము రెండు నెలల నుంచి పంచాయతీ అధికారులకు, సిబ్బందికి తమ వీధికి తాగునీరు సక్రమంగా రావడంలేదని మొరపెట్టుకున్నా తమ గోడు ఎవరు పట్టించుకోలేదన్నారు. చివరికి టీడీపీ నాయకులు చొరవతో తమ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. రెండు నెలల నుంచి తాగునీరు సక్రమంగా రాక ఇబ్బందులు పడ్డామన్నారు. సోమవారం పంచాయతీ సిబ్బంది సహకారంతో క్షుణ్ణంగా పంచాయతీ లైన్‌ను పరిశీలించడంతో ఓ దగ్గర వాల్వుని నీరు రాకుండా తిప్పేసి దానిపై ప్లాస్టిక్ గోతంతో కప్పేసి, మట్టి వేశారని దీంతో తమకు తాగునీరు సన్నగా వస్తున్నాయని తెలిపారు. తర్వాత దానిని కనుగొని సక్రమంగా చేసుకున్నామన్నారు. ఎవరూ కూడా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ముందు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శీనయ్యను వివరణ కోరగా పాములవీధికి తాగునీరు సక్రమంగా రావడంలేదని టీడీపీ నాయకులు తెలుపగా తమ సిబ్బందిని పంపించామని వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే వాల్వ్‌ను ఉద్దేశపూర్వకంగా తిప్పి ఇబ్బందులకు గురి చేసిన వారిని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

రేషన్ బియ్యం కోసం తిప్పలు

రాపూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో చౌక దుకాణాల్లో సరుకుల కోసం కార్డుదారులకు తిప్పలు తప్పడం లేదు. తెల్లవారుజాము నుంచే రేషన్ దుకాణాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రేషన్ బండ్లకు స్వస్తి చెప్పి, దుకాణాల వద్దే రేషన్ ఇస్తున్నారు. అది కూడా అన్ని చౌక దుకాణాల్లో ఒకేసారి పంపిణీ చేయడం లేదు. రెండు మూడు రోజులు ఒక దుకాణంలో సరుకులు ఇచ్చిన తర్వాతే మరో దుకాణంలో పంపిణీ చేస్తున్నారు. డీలర్లు రోజుకు 150 కార్డుదారులకు మాత్రమే రేషన్ ఇస్తుండడంతో అవస్థలు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అన్ని చౌక దుకాణాల్లో ఒకేసారి సరుకులు ఇచ్చే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్ఈఐఎల్ జాతీయ భద్రత వారోత్సవాలు

తోటపల్లిగూడూరు, మార్చి10 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అతి పెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇం డియా లిమిటెడ్‌లో సోమవారం జాతీయ భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇం డియా లిమిటెడ్ ఆపరేషన్ హెడ్ సునీల్ కుమార్‌గుప్తా, సీనియర్ అ ధికారులు పాల్గొన్నారు. సునీల్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ఎస్ఈఐ ఎల్ ఎనర్జీ అత్యుత్తమ భద్రతా ప్రమాణాలను పాటించడానికి కట్టుబడి ఉందన్నారు. పరిశ్రమలో అగ్రగామిగా గుర్తింపు పొందడం గర్వకారణం అని తెలిపారు. భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని విశ్వసిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అందరూ తమ కార్యకలాపాల్లో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి తెలిపామన్నారు. భద్రకు సంబంధించిన పోటీలో రాణించిన ఉద్యోగులు, సహచరులకు బహుమతి పంపిణీ చేశామని తెలిపారు. ఎస్ఈఐఎల్ భద్రత పట్ల అచంచలమైన అంకితభావంతో సురక్షితమైన, ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని కల్పిస్తూ, అత్యున్నత భద్రతా ప్రమాణాలను నిలబెట్టడానికి కంపెనీ కట్టుబడి ఉందన్నారు.

టెన్త్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈనెల 17నుంచి ఏప్రిల్ ఒకటి వరకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు డీపీటీవో జి.నరసింహులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షల రోజున విద్యార్థులు తమ స్వస్థలం నుంచి తాము పరీక్షలు రాసే కేంద్రం వరకు హాల్‌టికెట్ చూపి పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, సిటీ ఆర్డినరి బస్సులో ప్రయాణించవచ్చని తెలిపారు.



2025 నాకు ముఖ్యం

● చెస్ ఛాంపియన్ గుకేశ్

● శ్రీవారికి తలనీలాల సమర్పణ

తిరుమల, మార్చి10(ఆంధ్రజ్యోతి): '2025 నాకు చాలా ముఖ్యం. ఈ ఏడాది చాలా టోర్నమెంట్లు ఉన్నాయి. వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ప్రపంచ నెంబర్ వన్ స్థానం నా గురి' అని ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేశ్ అన్నారు. సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం సంతోషంతో కూడిన గొప్ప అనుభూతి అన్నారు.





తెప్పపై రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో రెండవ రోజు సోమవారం రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య విద్యుద్దీపాలంకరణలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన తెప్పపై ఆశీనులై పుష్కరిణిలో మూడు చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆహ్లాదకరమైన వాతావరణంలో తెప్పోత్సవం కనులపండువగా జరిగింది.

నకిలీ వెబ్‌సైట్లను నమ్మొద్దు

భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

తిరుమల, మార్చి10(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులు దర్శన టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు, వసతి గదుల కోసం నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దని టీటీడీ సోమవారం ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేసింది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీదేవస్థానం.ఏపీ.జీవోవీ.ఇన్'ను మాత్రమే వినియోగించాలని సూచించింది. కాగా, ఇప్పటికే కొన్ని నకిలీ వెబ్‌సైట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు పేర్కొంది. వెబ్‌సైట్‌కు సంబంధించిన సమాచారం కోసం కాల్‌సెంటర్ టోల్‌ఫ్రీ నెంబరు 155257 ను సంప్రదించాలని తెలిపింది.



అధ్యక్షా..

నీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయండి

అరణియార్ ప్రాజెక్టు ఆధునికీకరణకు గతంలో ఒక రెడ్డి రూ.26 కోట్లతో కాంట్రాక్ట్ తీసుకుని పనులు పూర్తి చేయకుండా వెళ్లిపోయారు. గత ప్రభుత్వంలో రూ.33 కోట్ల జైకా నిధులతో ఒక కాంట్రాక్టర్ పనులు చేపట్టి 17 శాతం చేసి మిగతా ఆపేశాడు. రెండువేల మంది మత్స్య కార్మికులకు జీవనం.. పదివేల ఎకరాలకు సాగునీరు, నాలుగు మండలాలకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్టు పనుల పూర్తికి ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కాళంగి రిజర్వాయర్ ఆధునికీకరణకు రూ.44 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా. వరదయ్యపాళెంలోని ఉబ్బల మడుగు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. నాగలాపురం మండలంలోని భూపతీశ్వర ప్రాజెక్టు వద్ద తాగునీటి సరఫరా పనులు వేగవంతం చేయాలి.



- కోనేటి ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే

దయనీయంగా 'రెవెన్యూ' భవనాలు



తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయం పైకప్పు పెచ్చులూడుతోంది. శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయాన్ని గత వైసీపీ పాలకులు అనాలోచితంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనంలో ఏర్పాటు చేశారు. అక్కడ కనీస సౌకర్యాల్లేక ప్రజలు, అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఏర్పేడు తహసీల్దారు కార్యాలయ సిబ్బంది ఇంటి నుంచి పాత దుప్పట్లను తెచ్చి కిటికీల వద్ద కట్టుకోవాల్సిన పరిస్థితి. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో 1.05లక్షల మంది, శ్రీకాళహస్తి రూరల్ పరిధిలో 80వేల మంది జనాభా ఉన్నారు. ఒకే మండలంగా కొనసాగడంతో ప్రజలకు సకాలంలో సేవలందడంలేదు. శ్రీకాళహస్తి రెవెన్యూ మండలాన్ని విభజించాలి. శ్రీకాళహస్తిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలి. ఈలోగా పూడిక తొలగింపునకు అత్యవసర నిధులు మంజూరు చేయండి.

- బొజ్జల సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

'ఆల్తూరుపాడు'కు నిధులు విడుదల చేయండి



డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయరుకు నిధులు మంజూరు చేయండి. 2018లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు రూ2.5 కోట్లు కేటాయించడంతో ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులు మొదలయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక రీ టెండరుకు వెళ్లి.. ఓ కాంట్రాక్టరు 27 శాతం లెస్‌తో పనులు దక్కించుకొన్నారు. తీరా పనులు చేయలేదు. ఇది పూర్తయితే వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో సుమారు 97 వేల ఎకరాలకు సాగునీరు, తిరుపతి, తిరుమలకు తాగునీరు అవసరాలు తీరతాయి. ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి మళ్ళీ టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నా.

- కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి ఎమ్మెల్యే

నూనె కాగుతోంది

● లీటరుపై రూ.10 నుంచి 15 పెంపు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. తాజాగా వంటనూనెల ధరలు పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. లీటరు వంట నూనెపై ఏకంగా రూ.10 నుంచి 15 రూపాయలు పెరిగింది. కొన్ని నూనెల డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా లేకపోవడంతో ధరలు పెంచాల్సి వచ్చిందనే వాదనలు వినిపిస్తున్నాయి. కిలో కొబ్బరి నూనె మీద సుమారుగా రూ.50 నుంచి 55 పెరిగింది. దీంతో మార్కెట్‌లో కొబ్బరి నూనె కిలో రూ.340 వరకు పలుకుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. గతేడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో కిలో వంటనూనె రూ.110 వరకు ఉండగా.. ప్రస్తుతం రూ.135 నుంచి 145 వరకు ధర పలుకుతోంది. వేరుశనగ నూనె లీటరు రూ.300 వరకు విక్రయిస్తున్నారు. ప్రధానంగా పామాయిల్, వేరుశెనగ నూనెకు డిమాండు ఉంది.

దుకాణాల వద్ద నకిలీ స్కానింగ్ స్టిక్కర్లు

తడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తడ పట్టణంలో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. ఆన్‌లైన్ నగదు లావాదేవీల కోసం వాపారులు తమ దుకాణాల వద్ద అంటించుకున్న స్కానింగ్ స్టిక్కర్లను మార్చేసి నగదును ఇతర ఖాతాల్లోకి మళ్లించుకున్న ఘటన తడలో జరిగింది. నగదు రహిత లావాదేవీలు అమల్లోకి వచ్చిన తరువాత చిన్నపాటి తోపుడు బండి నుంచి దుకాణాలు, హోటళ్ల వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు జరపడం సర్వసాధారణమైంది. ఇందులో భాగంగా తడలోనూ మాంస దుకాణాలు, హోటళ్లు, బేకరీలు, చిన్నపాటి దుకాణాల వద్ద గోడలకు స్కానింగ్ స్టిక్కర్లను అంటించుకున్నారు. దీన్నే ఆసరాగా తీసుకున్న సైబర్ నేరగాళ్లు ఆదివారం రాత్రి పలు దుకాణాల వద్ద ఉన్న స్కానింగ్ స్టిక్కర్ల స్థానంలో నకిలీవి అతికించారు. సోమవారం ఉదయం దుకాణాలకు వచ్చిన కొనుగోలుదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేసినా నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నట్లు మెసేజ్‌లు రాలేదు. దీంతో అనుమానించిన దుకాణదారులు సంబంధిత బ్యాంకులను సంప్రదించగా వారి ఖాతాల్లో నగదు జమ కాలేదని నిర్ధారణ అయింది. దుకాణం వద్ద స్కానింగ్ స్టిక్కర్ మార్చేయడం వల్లనే ఇలా జరుగుతోందని గుర్తించి లబోదిబోమన్నారు. కొన్ని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా ఆదివారం రాత్రి ఐదుగురు వ్యక్తులు కొన్ని దుకాణాల వద్ద తచ్చాడుతున్నట్లు గుర్తించారు. వారే ఇలా స్టిక్కర్లు మార్చి వుంటారని అనుమానిస్తున్నారు.

తడలో కొత్త తరహా మోసం



ఓ టిఫిన్ దుకాణం వద్ద అంటించిన నకిలీ స్కానింగ్ స్టిక్కర్

ముగ్గురు రుయా విద్యుత్తు సిబ్బందికి మెమోలు

● వారం రోజుల జీతం కోత

తిరుపతి(వైద్యం), మార్చి 10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న రుయా విద్యుత్తు విభాగంలోని ముగ్గురికి మెమోలు.. వారం రోజులపాటు జీతంలో కోత విధిస్తూ సూపరింటెండెంట్ రవిప్రభు సోమవారం ఆదేశాలిచ్చారు. ఆస్పత్రిలో ఆదివారం విద్యుత్తు సరఫరాలో చోటుచేసుకున్న అంతరాయానికి సంబంధించి 'రుయాలో గంటపాటు అంధకారం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, డీఎంఈ నరసింహం, కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందిస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. దీనిపై సూపరింటెండెంట్ తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులు, సిబ్బందితో అత్యవసర సమావేశాన్ని నిర్వహించి విచారించారు. తాత్కాలికంగా సరఫరా ఆపుతున్నట్లు ఆ శాఖ అధికారులు సిబ్బందికి సమాచారమిచ్చినా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. విద్యుత్తు లేని సమయంలో చిన్నపిల్లల వార్డులో ఎలాంటి మరణాలు జరగలేదని, రోజువారీగా ఉండే సాధారణ మరణాలే చోటుచేసుకున్నాయన్నారు. ఐసీయూ, ఏఎంసీ, అత్యవసర విభాగంలోని కొన్ని వెంటిలేటర్లకు.. చిన్నపిల్లల వార్డులోనూ ఎన్ఐసీయూ, ఐసీయూ వార్డులో గంటపాటు పనిచేసేలా ఇన్వర్టర్లు ఉన్నాయన్నారు. పాత జనరేటర్ స్థానంలో కొత్తదానిని రూ.15 లక్షలతో కొనుగోలు చేయాలన్నారు. సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, ఏఆర్ఎంవో హరికృష్ణ, చిన్నపిల్లల, ఆర్థో విభాగాధిపతులు మనోహర్, మధుసూదన్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 లలిత, ఏపీఎంఐసీడీసీ అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం) : 6.26

సహరి (బుధవారం) : 5.04



బాలాజీనగర్‌లో ఆరడుగుల నాగుపాము

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల బాలాజీనగర్‌లోని ఓ ఇంట్లోకి ప్రవేశించిన నాగుపామును సోమవారం భాస్కర్ నాయుడు పట్టుకున్నారు. ఆరు అడుగుల పొడవున్న ఆ పామును అడవిలో వదిలి పెట్టారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



మంత్రి నారాయణ - కోనా రఘుపతి - తీరక్రైత్ జేరియస్పెట్టసిన్ - ఎం రామరాజు

తిరుమల, మార్చి10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి నారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ ఎం రామరాజు, కోనా రఘుపతి, థాయ్-భారత్ కల్చరల్ లాడ్జ్ చైర్మన్, థాయిలాండ్ మాజీ మంత్రి తీరక్రైత్ జేరియస్పెట్టసిన్ ఉన్నారు.


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.05 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,478

తలనీలాలు సమర్పించినవారు: 26,667



పాటను మిగిల్చి వెళ్లిపోయావా...!

కన్నీరు మున్నీరవుతున్న గరిమెళ్ల శిష్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అక్షరానికి రాగం నేర్పినవాడు. సంగీతాన్ని సరళం చేసి అందరికీ అందించినవాడు. గాయకుడు, కవి, సంగీత స్రష్ట అయిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ హఠాన్మరణం ఆయన అభిమానులను దిగ్భ్రాంతి పరచగా, శిష్యులను దుఃఖంలో ముంచెత్తుతోంది. ఆయనతో కలిసి పాడినవారు, ఆయన కచేరీలకు వాయిద్య సహకారం అందించినవారు, ఆయన తీర్చిదిద్దిన సంగీత కళాకారులు ఎందరో గాజు పెట్టెలో నిశ్శబ్దంగా నిశ్చలంగా ఉన్న గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ భౌతిక కాయాన్ని సందర్శించి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు.



వైకుంఠంలోనూ అన్నమయ్య కీర్తన



ఆయనంటేనే సంగీతం. అన్నమయ్య పాట- బాలకృష్ణుని నోట అన్నట్టుగా వారి సంకీర్తనా యజ్ఞం సాగింది. నేదునూరి, పినాకపాణి, రాళ్లపల్లె, శ్రీనివాస రావు, మల్లిక్ స్వరపరిచిన కీర్తనలను కూడా ప్రాచుర్యంలోకి తెచ్చారు. అపర అన్నమయ్యగా పేరొందిన గరిమెళ్ల సంగీతాన్ని శ్రీ వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మ 47 ఏళ్లుగా విన్నారు. ఇంతకంటే గరిమెళ్లకు భాగ్యం ఏం కావాలి. వైకుంఠంలోని శ్రీమన్నారాయణుడి చెంత అన్నమయ్య కీర్తనలు వినిపించడానికి వెళుతున్నారని అనిపిస్తూ ఉంది. నా వంటి శిష్యులు ఒక్క కన్నీటి చుక్క తప్ప ఏమిచ్చి రుణం తీర్చుకోగలం.

- చిన్నమదేవి, శిష్యురాలు

అక్షరాన్ని రాగయుక్తంగా పలకడం నేర్పారు



మొదటిసారి టీటీటీ తెచ్చిన 'వెంకటాద్రి వెన్నెల' అనే క్యాసెట్‌లో గరిమెళ్ల వారి గొంతు విన్నాను. ఈ తర్వాత వెన్నెలలో ఆ గొంతు నన్ను వెంటాడింది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారు నిర్వహించే సంకీర్తన స్కాలర్‌షిప్ కోర్సులో 1999-2001 మధ్య వారి దగ్గర అన్నమాచార్య సంకీర్తనలు నేర్చుకునే అదృష్టం దక్కింది. ఇలా వారితో అనుబంధం ఏర్పడింది. నేదునూరి, మంగళంపల్లె ఇద్దరి సంగీతంలోని లాలిత్యం గరిమెళ్ల స్వరం. గణపతి, ఆంజనేయ, నవగ్రహ సంకీర్తనలు రాసి పాడారు. అయితే, ఒక అక్షరాన్ని ఎలా రాగయుక్తంగా పలకాలో వారి నుంచీ నేర్చుకున్నాను. జీవితంలో మరువలేని సంగీత గురువు గరిమెళ్ల.

- కె.సరస్వతి ప్రసాద్, గాయకుడు

ఆయన బాణీలకు వాద్య సహకారం గొప్ప జ్ఞాపకం



నా చిన్నప్పటి నుంచీ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌తో మా కుటుంబానికి మంచి అనుబంధం ఉంది. వారి అనేక సంగీత కచేరీలకు మృదంగ వాద్య సహకారం అందించాను. గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ రూపొందించిన కొత్త బాణీలకు వాద్య సహకారం అందించడం గొప్ప జ్ఞాపకం. స్వతహాగా గరిమెళ్ల మృదంగ విద్వాంసులు కావడంతో వారి స్వర రచన కూడా చాలా గమ్మత్తుగా ఉంటుంది. వారి సంగీత కచేరీలకు మృదంగ వాద్య సహకారం అందించడం అదృష్టంగా భావిస్తున్నాను.

- పారుపల్లె బాలసుబ్రమణ్యం, ఆకాశవాణి ఏ- గ్రేడ్ మృదంగ విద్వాంసుడు

గాయనిగా తీర్చిదిద్దిన అన్న



ముప్పై కొత్త రాగాలను సృష్టించారు. గరిమెళ్ల చేసిన ఈ సంగీత కృషికి వెల కట్టలేం. శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు పాడిన కీర్తనలను, నవగ్రహ కీర్తనలను అందరూ పాడుకునే విధంగా సరళం చేసి పాడారు. పాతికేళ్ల వయసులోనే సంగీత, సాహిత్యంతో కూడిన పుస్తకం రాశారు. వెంకయ్య స్వామి, దత్తాత్రేయ, ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి వారిపై సంకీర్తనలు కొత్తగా రాశారు. వారితో నాకు 46 ఏళ్ల పరిచయం. వారి చెల్లెలు వారి దగ్గర లేదు. మా అన్న నా దగ్గర లేరు. ఇందువల్ల ఇద్దరం అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని పంచుకున్నాం. సంగీతంలోని మెలకువలు నేర్పి నన్ను గాయనిగా తీర్చిదిద్దారు.

- ఎన్‌సీ శ్రీదేవి, ప్రముఖ గాయని

దూరవిద్యా పరీక్షలు వెంటనే నిర్వహించండి

● ఎస్వీయూ అధికారులకు హైకోర్టు ఆదేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ దూరవిద్యా పరీక్షలను వెంటనే నిర్వహించాలని ఆ వర్సిటీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. 2021వ సంవత్సరం అడ్మిషన్ పొందిన విద్యార్థులకు 2024 లోపు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే, యూనివర్సిటీ నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకూ పరీక్షలు నిర్వహించలేదు. ఈ ఏడాది జనవరి 2 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ఆ తర్వాత ఎలాంటి కారణం లేకుండా పరీక్షలను వాయిదా వేశారు. అనంతరం ఫిబ్రవరి 3 నుంచీ పరీక్షలు నిర్వహిస్తామని హాల్‌టికెట్లు కూడా జారీ చేసినా.. మళ్లీ వాయిదా వేశారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 24 నుంచి రాష్ట్రంలోని 46 ప్రభుత్వ గుర్తింపుగల కాలేజీల్లో పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా మూడోసారి పరీక్షలను వాయిదా వేశారు. దీనిపై దూరవిద్యా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో మార్చి 17 నుంచీ పరీక్షలు నిర్వహించాలని గత వారం హైకోర్టు తీర్పునిచ్చింది. అయినప్పటికీ 10వ తరగతి పరీక్షల కారణంగా ఈ నెల 17 నుంచి పరీక్షలు నిర్వహించలేమని నాలుగోసారి దూరవిద్యా పరీక్షలను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో 10వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 2 నాటికి ముగియనున్నారు. దీంతో ఏప్రిల్ 2వ తేది తర్వాత 46 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని ఎస్వీయూ ఉన్నతాధికారులను హైకోర్టు ఆదేశించింది.

ఇప్పటికైనా పరీక్షలు జరిగేనా?

ఎస్వీయూ దూరవిద్యా విభాగంలో గతేడాదిగా పరీక్షలు పదే పదే వాయిదా పడుతున్నాయి. ఈ పరీక్షల కోసం సుమారు 32 వేల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నట్టు అంచనా. ఈ పరీక్షలకు ఇప్పటికే రూ.8 కోట్ల వరకూ ఫీజుల రూపంలో యూనివర్సిటీకి అందినట్టు తెలుస్తోంది. గతేడాది మార్చిలో పరీక్షా ఫీజు చెల్లించినా ఇంకా పరీక్షలు నిర్వహించకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ విలువైన కాలాన్ని కోల్పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పరీక్షలను నిర్వహించాలని కోరుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికైనా ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు జరిగేనా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

అత్త హత్య కేసులో అల్లుడి అరెస్టు



నిందితుడ్ని అరెస్టు చూపుతున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వివిధ వ్యసనాలతో బాధపడుతూ డబ్బుకోసం అత్తను హత్య చేసిన రవీంద్ర నాయక్‌ను తిరుపతి వెస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రీలత తెలిపిన ప్రకారం.. నగరంలోని చిన్నగుంటలో కాపురమున్న గోపాల్‌రెడ్డి భార్య ప్రమీల పాచి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఈ నెల ఏడో తేదీ మధ్యాహ్నం ఇంట్లో ఉన్న సమయంలో ఆమె అల్లుడు రవీంద్ర నాయక్ డబ్బులు కావాలని డిమాండు చేశాడు. తనవద్ద లేదని ఆమె చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో ఆగ్రహించిన అతడు ఆమె చేతులు కట్టి, కాళ్లతో తన్ని, చేతులతో గొంతు నులిమి హత్య చేశాడు. మృతురాలి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో రెండు బృందాలు తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో గాలించారు. తిరుపతిలోని వేదిక్ వర్సిటీ వద్ద నిందితుడు ఉన్నట్టు అతడి మొబైల్ నెట్ వర్క్ ఆధారంగా సోమవారం పోలీసులు గుర్తించి వెళ్లారు. పోలీసులను చూసిన నిందితుడు పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ మురళీమోహన్‌తో పాటు ఎస్ఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐ వెంకటరత్నం, హెడ్ కానిస్టేబుల్ రాము, కానిస్టేబుళ్ళు రమేష్, తిలక్ కుమార్‌లను డీఎస్పీ శ్రీలత అభినందించారు.



ఎన్‌హెచ్‌పై ధాన్యం ట్రాక్టర్ బోల్తా

● 3 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం

తడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తడ మండలం కొండూరు వద్ద జాతీయ రహదారిపై సోమవారం ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ధాన్యం బస్తాలు రోడ్డంతా పడిపోవడంతో దాదాపు 3 గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాక్టర్ బోల్తా పడిన వెంటనే డ్రైవర్ పరారైనట్లు స్థానికులు చెప్పారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్, ధాన్యం బస్తాలను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన సమస్యల్లో భూవివాదాలే ఎక్కువ



ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలంటూ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం, వరి కంకిలను అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు వచ్చిన అర్జీల్లో భూవివాదాలే ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రజలు 265 సమస్యలపై ఇచ్చారు. వీటిలో 172 భూవివాదాలవే కావడం సమస్య తీవ్రతకు నిదర్శనం. కాగా, పీజీఆర్ఎస్ ద్వారా అందే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు వినతులు స్వీకరించారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టండి

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా కృష్ణమనాయుడు, పలువురు రైతుల కోరారు. ఎంఎస్పీ రకం ధర రూ.19,720 ఉండగా రూ.17వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. రైతుల పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం వెంటనే ఎంఎస్పీ వరిధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేయాలని కోరారు. ఎకరాకు ఇస్తున్న గోనెసంచుల సంఖ్యను 75కు పెంచాలని కోరారు.

ఓటేరు చెరువును పరిరక్షించండి

ఓటేరుచెరువువద్ద కబ్జాదారులు అక్రమంగా తోలిన ఎర్ర మట్టిని తక్షణమే తొలగించేలా చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అంజయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జయచంద్ర కోరారు. ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీకాళహస్తికిచెందిన కొందరు చెరువును కబ్జాచేశారని, వారిని తక్షణమే నిలువరించాలన్నారు. భూకబ్జాదారులకు ఆ భూమిని అప్పగిస్తే పేదలను సమీకరించి ఆచెరువులో ఎర్ర జెండాలు పాతి నిరుపేదలకు ఇంటి స్థలాలుగా పంచుతామన్నారు.సీపీఐ నేతలుచిన్నం పెంచలయ్య, విశ్వనాథ్, పద్మనాభరెడ్డి, గోపాల్‌రెడ్డి,నదియా,రత్తమ్మ, విజయ పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

మామిడికి గిట్టుబాటు ధర లభించేలా చూడాలని అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య నేత మాంగాటి గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరావు, శేఖర్‌రాజు తదితరులు కోరారు. ఈసారి దిగుబడి అధికంగా ఉందని పసిగట్టిన మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు కొత్త ఎత్తులు వేస్తున్నారన్నారు. మామిడిగుజ్జుకు విదేశాల్లో గిరాకీ లేదని, ఈ సంవత్సరం మామిడికాయలను కొనలేమంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తోతాపూరికి గిట్టుబాటు ధర కల్పించాలని, టేబుల్ వెరైటీని విదేశాలకు ఎగుమతిచేసి ఆదుకోవాలన్నారు.

స్వర్ణముఖి నదీ తీర ప్రాంతం పరిరక్షించండి

స్వర్ణముఖి నదీ తీర ప్రాంతాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని కలెక్టర్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు ఆందోళన వ్యక్తంచేశారు. నదీ తీరంలో అక్రమంగా గుడిసెలు వేసి కరెంటు కనెక్షన్ తీసుకుని చివరికి పంచాయతీల్లో ఇంటి పన్ను చెల్లిస్తూ నిర్మాణా లు చేపడుతున్నారన్నారు. వీరికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

ఒంటికాలితో ఇబ్బంది పడుతున్నా



'షుగర్ కారణంగా నా ఎడమ కాలు తొలగించారు. కూలీకి వెళితే కానీ కుటుంబం గడవని పరిస్థితి. మూడేళ్లుగా పింఛను కోసం ఒక కాలితోనే కుంటుకుంటూ కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా. పింఛను ఇప్పించి కుటుంబాన్ని ఆదుకోండి' అంటూ తిరుపతి అర్బన్ చింతలచేనుకు చెందిన మంగమ్మ అధికారులను అభ్యర్థించారు.

పేరూరు సప్లై చానల్‌ను పునరుద్ధరించండి

తుమ్మలగుంట చెరువుకు పోయే పేరూరు సప్లై చానల్‌ను కొంతమంది ఆక్రమించారని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ సప్లై చానల్‌ను పునరుద్ధరించాలని కోరారు. సాయినగర్ పంచాయతీలో నడుస్తున్న మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని ఏపీ మహిళ సమైక్య కార్యదర్శి నదియా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

'వేదము' వెబ్‌సైట్ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞానాన్ని సాంకేతీకరించాల్సిన అవసరం ఉందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పది రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌తో పాటు 'వేదము.ఓఆర్‌జీ' వెబ్‌సైట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. వెబ్‌సైట్ ద్వారా వేద విజ్ఞాన వ్యాప్తికి అవకాశం కలుగుతుందన్నారు. సత్యసాయి వేద సంస్థ ప్రతినిధి పరమహంసులు, మాజీ రిజిస్ట్రార్ రమాశ్రీ, డీన్ రజనీకాంత్‌శుక్లా, అద్వైత వేదాంత విభాగ హెడ్ గణపతిభట్, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సీసీ కెమెరాలన్నీ పనిచేసేలా చూడండి: ఎస్పీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నాయుడుపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీసీ కెమెరాలన్నీ పనిచేసేలా చూడాలని, తద్వారా నేరాలను వేగవంతంగా అరికట్టేందుకు అవకాశం ఉంటుందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. నాయుడుపేట పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా మసులుకోవాలని, అలాగే కేసుల సకాలంలో దర్యాప్తు చేయాలన్నారు. నాయుడుపేట సర్కిల్ పరిధిలో జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వేసవిలో ప్రజలు ఆరుబయట నిద్రిస్తారని, ఇళ్లలో చోరీలు జరగకుండా గస్తీ పెంచాల న్నారు. కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, సీఐలు బాబి, సంఘమేశ్వరరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు మామోగ్రామ్ చేయించుకోవాలి



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడానికి వీలుగా 35 ఏళ్లు దాటిన మహిళలందరూ మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని వళ్లిపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్ సూచించారు. తిరుపతిలో శ్రీవెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం కోట మండలంలోని కొక్కుపాడు, వంజివాక గ్రామాల్లో ఉచిత స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ దినేష్‌తో పాటు స్విమ్స్ వైద్యులు, సిబ్బంది పాల్గొని పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పలగాటి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, రోగులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జితేందర్ రెడ్డి, రాధారెడ్డి, శ్యామసుందర్‌రెడ్డి, పోలయ్య, వైద్యులు పద్మావతి, హరిత, అంకమ్మ, సూపర్‌వైజర్లు స్వర్ణకుమారి, భువనేశ్వరి, మస్తానమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీద రవిచంద్ర ఎంపికపై సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

గూడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీద రవిచంద్రను టీడీపీ అధిష్ఠానం ఎంపిక చేయడంతో సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, టవర్ క్లాక్ సెంటర్ వద్ద టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బీద రవిచంద్రను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, బత్తిన సుధాకర్, ముమ్మడి వెంకటేశ్వర్లు, అమరయ్య, సునీల్, పార్వతయ్య, పులిమి శివకుమార్, ఓంప్రకాష్, ఇశ్రాయిల్ కుమార్, ముప్పా చరణ్, సన్నీ, సందీప్, సాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీద రవిచంద్రను ఎంపిక చేయడాన్ని హర్షిస్తూ కూటమి నేతలు సోమవారం పట్టణంలో సంబరాలు జరుపుకొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, గంగాధరం, బీరం రాజేశ్వరావు, కాపా శ్రీనివాసులు నాయుడు, మంకు ఆనంద్, సామల లక్ష్మీపతి, పప్పు చంద్రమౌళిరెడ్డి, చెంచయ్య, చలపతి, రామచంద్రయ్య, టీవీఆర్, కుమార్ యాదవ్, శచంద్రీ యాదవ్, నారి శేఖర్, జనసేన నాయకులు జంపాల ప్రకాష్, చింజీవులు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

దుగరాజపట్నం పోర్టులో వేలాది మందికి ఉపాధి



మీడియాతో మాట్లాడుతున్న చింతా మోహన్

నాయుడుపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): దుగరాజపట్నం పోర్టు ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా దుగరాజపట్నం పోర్టు ఏర్పాటుకు అనుమతించదని తెలిపారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు దుగరాజపట్నం పోర్టు నిర్మాణానికి కృషి చేయాలని చింతా మోహన్ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగూర్, గాడి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పదోన్నతులు ఆపాలి

డక్కిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు జరిగే వరకు అన్ని శాఖల్లో పదోన్నతులను వాయిదా వేయాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా మహాజన టీచర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు చేమూరి మస్తాన్ మాదిగ, ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య అన్నారు. సోమవారం వారు నెల్లూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఈనెల 11న నివేదికను ప్రభుత్వానికి అందజేస్తుందన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్ 3 ఏఎన్‌ఎంలకు పదోన్నతుల కోసం మెరిట్ లిస్టు ప్రకటించడంతో పాటు ఈనెల 13న కౌన్సెలింగ్ నిర్వహించాలని డీఎంహెచ్‌వో ప్రకటించారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టక ముందే పదోన్నతులు ఇవ్వడం వల్ల మాదిగ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహాజన టీచర్స్ అసోషియేషన్ నాయకులు మస్తాన్ మాదిగ, గోరిపాటి వీరయ్య, కాకుమాని జ్యోతి, దుగ్గినపల్లి రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

వాకాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు సోమవారం మండల కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు బహుమతులు ప్రదానం చేశారు. బాలిరెడ్డిపాళెం పాఠశాల విద్యార్థిని దివిత ప్రథమ బహుమతి, దుగరాజపట్నం విద్యార్థిని సుహారిక ద్వితీయ బహుమతి, వాలిమేడు విద్యార్థి చాణిక్య తృతీయ బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో నసీం ఆలీ, హెచ్‌ఎంలు నాగమణి, లక్ష్మి, వెంకయ్య పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు
యువకుడి మృతి



మృతిచెందిన వినోద్

తడ, మార్చి10 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి గాయాలయ్యాయి. తడ మండలంలోని పూడి గ్రామానికి చెందిన వెట్టి భాస్కర్, పక్కింట్లో ఉంటున్న ఇరుగుళం వినోద్(24)ను ఆదివారం అర్ధరాత్రి సమయంలో బైక్‌లో తడకు బయలుదేరారు. జాతీయ రహదారిపై వేగంగా వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న భాస్కర్‌కు గాయాలయ్యాయి. వెనుక కూర్చొని వున్న వినోద్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వినోద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

నాయుడుపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనేటిరాజుపాళెం సమీపంలో 3 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా కప్పరాళ్లతిప్ప గ్రామానికి చెందిన చిన్ని సోమవారం 3 కిలోల గంజాయి తరలిస్తుండటంతో స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

ఆహారం... కల్తీమయం

- ప్రజారోగ్యంతో చెలగాటం
- పట్టించుకోని అధికారులు




విక్రయానికి సిద్ధంగా ఉంచిన రంగు కలిపిన మాంసం - కొంతకాలం క్రితం మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్న నిల్వఉంచిన మాంసం(ఫైల్‌ఫొటో)

గూడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు నాణ్యతలేని ఆహార పదార్థాలను విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన గూడూరులో లక్ష మందికి పైగా జనాభా ఉంది. అలాగే రైల్వే జంక్షన్ కావడంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో జనం రాకపోకలు సాగిస్తుంటారు. వివిధ ప్రాంతాల నుంచి రైళ్లలో వచ్చే శ్రీవారి భక్తులూ ఇక్కడ దిగి తిరుపతి వెళుతుంటారు. దీంతో పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లు, బేకరీలు తదితర తినుబండారాల దుకాణాలు పుట్టగొడుగుల్లాగా వెలుస్తున్నాయి. అయితే ఈ దుకాణాల్లో ఆహార భద్రతకు సరైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కల్తీ ఆహారాన్ని విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రైల్వేస్టేషన్ సమీపంలోని హోటళ్లలో నాణ్యత లేని ఆహారం తిని వారు అస్వస్థతకు లోనవుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా ఆహార పదార్థాల్లో రసాయనాలతో కూడిన రంగులు కలపడం, కల్తీ నూనెలు, నిల్వ చేసిన మాంసాన్ని వినియోగించడం, హోటళ్ల వంట గదుల్లో శుభ్రత పాటించకపోవడం జరుగుతోంది. గతంలో మున్సిపల్ అధికారులు మాంస విక్రయ దుకాణాలపై దాడులు నిర్వహించి ఫ్రీజర్లలో పెద్దమొత్తంలో నిల్వ ఉంచిన కోడి మాంసాన్ని గుర్తించారు. ఇటీవల బైపాస్ సమీపంలోని ఓ హోటల్‌లో ఒక ఉపాధ్యాయుడు వెజిటబుల్ బిర్యానీ పార్శిల్ తీసుకుని ఇంటికెళ్లి చూడగా అది కుళ్లిపోయి ఉంది. దీంతో ఆ దుకాణదారుడితో కొనుగోలుదారుడు వాగ్వాదానికి దిగిన ఘటన చోటుచేసుకుంది. అదేవిధంగా రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ హోటల్ బిర్యానీలో బల్లి అవశేషాలు కనిపించడం, అదే ప్రాంతంలోని ఓ బేకరిలో కొన్న కేక్‌లో ఈగ అవశేషాలు ఉండడాన్ని కొనుగోలుదారులు గుర్తించి ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి తినుబండారాల దుకాణాల్లో నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అదృశ్యమైన విద్యార్థినుల ఆచూకీ లభ్యం



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ గీతకుమారి

వెంకటగిరి టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వసతి గృహంలో ఉంటూ అదృశ్యమైన ముగ్గురు విద్యార్థినుల ఆచూకీ లభ్యమైందని గూడూరు డీఎస్పీ గీత కుమారి తెలిపారు. సోమవారం వెంకటగిరి పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం ట్యూషన్‌కు వెళ్లిన విద్యార్థినులు సాయంత్రం 4.30 వసతి గృహానికి రావాలి. పొద్దు పోతున్నా రాకపోవడంతో వార్డెన్ చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లేకపోయేసరికి రాత్రి 10గంటలకు ఎస్‌ఐ సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పట్టణంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా నాయుడుపేట బస్సు వెక్కి వెళ్లినట్లు గుర్తించారు. మళ్లీ అక్కడి నుంచి తిరుపతికి వెళ్లినట్లు తెలిసింది. తిరుపతి బాలాజీ కాలనీలో సోమవారం ఉదయం 5గంటలకు విద్యార్థినులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పదో తరగతి పరీక్షల భయంతో వసతి గృహం నుంచి వెళ్లిపోయినట్లు విద్యార్థులు వెల్లడించారని, తల్లిదండ్రులు విద్యార్థు లను ఎక్కువగా ఒత్తిడి చేయవద్దని, వారికి ఎందులో ఇష్టమో తెలుసు కుని పోత్సహించాలని డీఎస్పీ సూచించారు. పది గంటల్లో విద్యార్థులను ఆచూకీ కనుగొన్న సీఐ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు, భవాని, శివశంకర్, గోపీలకు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్, సీడీపీవో షంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణ పథకాలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ పవన్‌కుమార్ సింగ్, పక్కన రీజినల్ మేనేజర్ మోహన్ రెడ్డి, మేనేజర్లు

సూళ్లూరుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ పవన్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మంగానెల్లూరులో బంగారు ఆభరణాలపై రుణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై గ్రామీణ ప్రాంతాల్లోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుల్లో బంగారు ఆభరణాలపైనే కాకుండా విద్య, వ్యవసాయేతర రుణాలు, వ్యాపార రుణాలు పొందవచ్చన్నారు. రూఫ్ టాప్ సోలార్ రుణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట నష్టం, ప్రకృతి విపత్తుల కారణంగా రుణాలు చెల్లించలేని రైతులు ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకోవాలని రీజినల్ మేనేజర్ మోహన్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఛీఫ్ మేనేజర్ ఆంజ నేయులు, సీనియర్ మేనేజర్ రవితేజ, మంగానెల్లూరు బ్యాంక్ మేనేజర్ వినోద్‌కుమార్, టీడీపీ నాయకులు గాడి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి టీడీపీలో తగిన గుర్తింపు



బీద రవిచంద్రను అభినందిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే వారికి టీడీపీలో తగిన గుర్తింపు ఉంటుందని, ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీద రవిచంద్రను ఎంపిక చేయడమే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన బీద రవిచంద్రను సోమవారం అమరావతిలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ బలోపేతానికి బీద రవిచంద్ర ఎంతో కృషి చేశారన్నారు.

అండర్ బ్రిడ్జిలను నిర్మించండి

నాయుడుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రధాన క్రాస్‌రోడ్డు వద్ద అండర్ బ్రిడ్జిలను నిర్మించేలా కృషి చేయాలని తిరుపతి ఎంపీ గురుమూర్తికి ఇటీవల స్థానికులు విన్నవించారు. ఎంపీ సూచనతో నేషనల్ హైవే కన్సల్‌టెన్సీ ప్రతినిధి వెంకటేశ్వర్లు సోమవారం ఆయా గ్రామాల ప్రజలతో కలిసి మాట్లాడారు. నాయుడుపేట మండల పరిధిలోని విన్నమాల, నరసారెడ్డికండ్రిగ, అయ్యప్పరెడ్డి, పండ్లూరు ప్రాంతాల్లో క్రాస్ రోడ్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని స్థానికులు వివరించారు. ఈ విషయాన్ని నేషనల్ హైవే ప్రాజెక్టు ఉనతాధికారులకు తెలియజేయనున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో కామిరెడ్డి రాజారెడ్డి, జలదంకి మధుసూదన్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, శేఖర్, సుబ్బరామిరెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో బీసీలకు సముచిత స్థానం



బీద రవిచంద్రను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, మార్చి 10 (ఆంధ్రజోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, బీసీ నేత బీద రవిచంద్రకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంతో బీసీలకు సముచిత స్థానం ఇస్తున్నట్లు మరోసారి రుజువయ్యిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. సోమవారం అమరావతిలో బీద రవిచంద్రను మాజీ ఎంపీ, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో పాటు మండల నాయకులు కలిసి సత్కరించారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు సుబ్బరామయ్య, మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, కృష్ణమ నాయుడు, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థుల డీబార్

నాయుడుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాల్గవ సెమిస్టర్ పరీక్షలు సోమవారం నిర్వహించారు. కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌శర్మ తెలిపారు.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

సూళ్లూరుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం సూళ్లూరుపేట వైసీపీ పార్టీ కార్యాలయంలో ఆయన ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఎన్నో హామీచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కోసం ఈనెల 12న నిర్వహిచనున్న యువత పోరుబాట కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, వైసీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చిన్ని సత్య నారాయణ, వైసీపీ నాయకులు కృపాకర్‌రెడ్డి, అలవల సురేష్, జెట్టి వేణుయాదవ్, వాసు మొదలి, అయితా శ్రీధర్, వాకాటి బాబురెడ్డి, రామకృష్ణారెడ్డి, చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

'యువత పోరు'ను విజయవంతం చేయండి

వెంకటగిరి టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 12న నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ పట్టణ కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో యువత పోరు పోస్టర్లు ఆవి ష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నారాయణ, అరి శంకరయ్య, సుబ్బారావు, రాజారెడ్డి, పేచీరాజ్, సిరాజుద్దీన్, రసూల్, సురేష్ పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి

డక్కిలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి దిశా నిర్దేశం చేశారు. ప్రతి అర్జీకి రసీదు ఇవ్వాలని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, మండల సర్వేయర్ రాజగోపాల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రియాంక, ఏఎస్‌వో వెంకటయ్య పాల్గొన్నారు

ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్

పెళ్లకూరు, మార్చి 10 (ఆంధ్రజోతి): మండల పరిధిలో 71వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు సీఐ సంగమేశ్వర రావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ నాగరాజు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఎస్‌ఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను ఆపి డ్రైవర్లకు ముఖం కడుక్కునేందుకు నీళ్లు ఇచ్చారు. అలాగే తాగడానికి మంచి నీరు, టీ అందించారు.

పూలే దంపతులకు నివాళి

నాయుడుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద సోమవారం పూలే దంపతుల విగ్రహాలకు బీసీ సంఘ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వలపాటి మస్తాన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు షేక్ షరీఫ్, ధనంజయ్య, ఎస్.రామయ్య, సులేమాన్, ప్రతాప్, నరేష్, బాలాజీ, శేఖర్, వినోద్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్టు

కోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి అరుంధతీయవాడలో ఈనెల 7వ తేదీన ఫాతిమా ఆత్మహత్య చేసుకొన్న ఘటన తెలిసిందే. భర్త మనోహర్, అత్త కమలమ్మ వేధింపుల వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఫాతిమా తల్లి అరుణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం కమలమ్మ, మనోహర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

యువతి అదృశ్యం

డక్కిలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం కుప్పాయపాళెం గ్రామానికి చెందిన నీలకంఠం సింధు (21) అదృశ్యం అయినట్లు కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి వరకు తమతోనే ఉన్న సింధు సోమవారం తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదని చెప్పారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

వాకాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళలకు బీసీ కార్పొరేషన్ ద్వారా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు అందజేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. 18నుంచి 57 సంవత్సరాల వయసు ఉండి, బీసీ, ఈడీసీ, కమ్మ, రెడ్డి, వైద్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు మహిళలు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఏపీ ఓబీఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా కుల, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంక్‌ఖాతా వివరాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుడిపై అధికారుల విచారణ

నాయుడుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ పాఠశాల విద్యార్థినిపై ఉపాధ్యాయుడు అత్యాచారం చేసినట్లు ఫిర్యాదు వచ్చింది. ఈ విషయమై సోమవారం డిప్యూటీ డీఈవో శరత్‌కుమార్, సీడీపీవో, ఎస్‌ఐ ఆదిలక్ష్మి, ఎంఈవో శాంతి బాధిత బాలికను, ఇతర విద్యార్థులను, ఉపాధ్యాయులను విచారించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు వారు తెలిపారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

చిల్లకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక డానియేల్ చిల్డ్రన్స్‌హోమ్‌లో పదో తరగతి విద్యార్థులకు పీపుల్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఫౌండర్ పోతుగుంట మల్లికార్జున్‌రావు చేతుల మీదుగా పరీక్షా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బిజేంద్రకుమార్, అరుణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించండి



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగనవాడీల నిరసన

కోట, మార్చి 10(ఆంధ్రజ్యోతి) తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు హెచ్చరించారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట సోమవారం కోట, వాకాడు, చిట్టమూరు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన చేపట్టారు. జీతాలు పెంచాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు.

తిరుచ్చి ఉత్సవం

సూళ్లూరుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంగళంపాడు వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం ఉదయం తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మూల విరాట్‌ను పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. రాత్రి స్వామివారు సింహ వాహనంపై ఊరేగారు. ఉభయ కర్తలుగా దశయ్య, ధనపాల్, మల్లికార్జున వ్యవహరించారు.

ఉచిత వైద్య శిబిరం

గూడూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం నెల్లూరుకు చెందిన ఎస్ఎస్ క్లీనిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ షంషీర్, డాక్టర్ షబానా, విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు మెహబూబ్ బాషా పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

గూడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం జేవీవీ ఆధ్వర్యంలో బాలకృష్ణంరాజు దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తం రావు, ప్రభాకర్, సుమన్, రజనీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.